Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 18.07.2014, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 07 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## ఆంధ్రా సీఎంను...

# ఆపుతున్నదెవరు?

## ఆస్తులా?.. ఆప్పులా?

- హైదరాబాద్‌ను వదలనంటున్న చంద్రబాబు
- విజయవాడలో క్యాంపు కార్యాలయం వట్టి డాబు

ఆంధ్రులను 'హైదరాబాద్' జబ్బు ఇంకా వదల్లేదు. ఆ నగరాన్ని వదిలి రావడానికి మనవాళ్లకు మనసొప్పడం లేదు. హైదరాబాద్ వాతావరణానికి అలవాటు పడిపోయారు. ఎండాకాలంలోనూ పెద్దగా చెమటపట్టదు. స్టార్ హోటళ్లు, షాపింగ్‌మాల్స్, విశాలమైన రహదారులు, మల్టీప్లెక్స్‌లు, పబ్‌లు వంటి విలాసవంతమైన కల్చర్‌ను వదిలి రాలేక పోతున్నారు. హైదరాబాద్‌లో ఉద్యోగ, వ్యాపారాల రీత్యా స్థిరపడ్డ వాళ్లు రాలేక పోతున్నారు సరే... మరి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హైదరాబాద్‌ను ఎందుకు వదల్లేకపోతున్నారన్నది పెద్ద ప్రశ్నగా మారుతోంది.

ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రెండోరోజు నుండే ఏపిలో నుండే పరిపాలన సాగిస్తానని చెప్పిన ఆయన ఇప్పుడు ఆ మాటే పట్టించుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విజయవాడలో క్యాంప్ కార్యాలయాన్ని తయారు చేయమన్న చంద్రబాబు ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. పదేళ్లు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని కాబట్టి తన పదవీకాలమంతా హైదరాబాద్‌లోనే గడిపేయాలని భావిస్తున్నట్లుంది. ముఖ్యంగా చంద్రబాబు ఏపిలో ఉండి పరిపాలన చేయకుండా కొన్ని శక్తులు అడ్డుకుంటున్నాయి. వీరిలో ఆంధ్రవారితో పాటు తెలంగాణ టీడీపీ (మిగతా 10వ పేజీలో)



## నెల్లూరు జడ్పీ...

# 'దేశం' వశమైనట్లే?

రెండుసార్లు జిల్లా పరిషత్ ఛైర్మెన్ ఎన్నిక వాయిదా పడిన ఫలితం... జడ్పీ ఛైర్మెన్ కుర్చీని తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకునే అవకాశాలు మెరుగయ్యాయి. నిబంధనల ప్రకారం మొదటిసారైనా, రెండోసారైనా ఎన్నికలు జరిగి ఉంటే జడ్పీ ఛైర్మెన్ సీటును వైయస్సార్‌కాంగ్రెస్‌పార్టీ గెలుచుకుని ఉండేది. కాని రెండుసార్లు ఛైర్మెన్ ఎన్నిక వాయిదా పడ్డ కారణంగా దాని ప్రభావం వైకాపా మీద తీవ్రంగా పడింది. జడ్పీ ఛైర్మెన్ ఎన్నికకు ముందే ఆరుగురు తమ పార్టీ జడ్పీటీసీలను కోల్పోయిన వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆ తర్వాత జరిగిన పరిణామాలలో మరో ముగ్గురు జడ్పీటీసీలను కూడా కోల్పోయినట్లు తెలుస్తుంది.

ఇప్పుడు జడ్పీ ఛైర్మెన్ ఎన్నికలో కావలి రూరల్ జడ్పీటీసీ పెంచలమ్మ, ఇందుకూరుపేట జడ్పీటీసీ వెంకటరమణయ్యలు కీలకంగా మారారు. ఈ నెల 13వ తేదీన ఎన్నిక నిర్వహించినప్పుడు కావలి జడ్పీటీసీ (మిగతా 10వ పేజీలో)





## బదిలీపై గ్రేవాల్...

# కొత్త ఎస్పీగా సెంథిల్

జిల్లా ఎస్పీ నవదీప్‌సింగ్ గ్రేవాల్ విజయనగరం జిల్లా ఎస్పీగా బదిలీ అయ్యారు. అనంతపురం జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న సెంథిల్‌కుమార్‌ను నెల్లూరుజిల్లా కొత్త ఎస్పీగా నియమించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన సెంథిల్‌కుమార్ 2008 సంవత్సరం బ్యాచ్ ఐపిఎస్ అధికారి. తొలుత వరంగల్, శ్రీకాకుళం ఏఎస్పీగా పనిచేసారు. అనంతరం పదోన్నతిపై శంషాబాద్ డిసిపిగా నియమితులయ్యారు. ఎన్నికల నేపథ్యంలో సెంథిల్‌కుమార్‌ను అనంతపురం జిల్లా ఎస్పీగా నియమించారు. సెంథిల్‌కు గట్టిగా, ముక్కుసూటిగా పనిచేస్తాడనే పేరుంది. అనంతపురం జిల్లా ఎస్పీగా సమర్థవంతంగా పనిచేసాడనే పేరు తెచ్చుకున్నారు.

కాగా, ఇక్కడ నుండి బదిలీ అయిన నవదీప్‌సింగ్ గ్రేవాల్ ఫిబ్రవరి 16న ఈ జిల్లా ఎస్పీగా వచ్చారు. గతంలో ఎస్పీలుగా పనిచేసి విమర్శలపాలైన ఎస్పీలను ఈయన తన పనితీరుతో మంచి అనిపించారు. డైరక్ట్ (మిగతా 10వ పేజీలో)

## వెంకయ్య కోసం

# ముస్తాబైన నగరం

(వివరాలు 3వ పేజీలో)



# నెల్లూరులో రంగుల ప్రపంచం

## తడ సమీపంలో సినీస్టూడియో

## సినీనిర్మాత సురేష్ సూపర్‌ప్లాన్



***సినీ పరిశ్రమ... అదొక రంగుల ప్రపంచం. అందమైన లోకం. ఈ పరిశ్రమ ఎక్కడుంటే ఆ ప్రాంతం సీతాకోక చిలుకల వనంలా ఉంటుంది. ఆ ప్రాంతానికే ఎనలేని గ్లామర్ వస్తుంది. ముంబై, చెన్నై, హైదరాబాద్ వంటి మహానగరాల అభివృద్ధిలో ఈ సినీ గ్లామర్ ప్రముఖ పాత్ర పోషించింది. సినీప్రపంచంతో అన్ని రంగాలకు అవినాభావ సంబంధముంటుంది. వ్యాపార, వాణిజ్య కార్యక్రమాల విస్తరణకు సినీపరిశ్రమ ఎంతగానో దోహదపడుతుంది.***

అలాంటి గ్లామర్ ప్రపంచానికి నెల్లూరు నెలవు కాబోతుందా? ఈ ప్రశ్నకు అతి త్వరలోనే సమాధానం రాబోతుంది. నెల్లూరుజిల్లా సరిహద్దు ప్రాంతమైన తడ కేంద్రంగా సరికొత్తగా తెలుగు సినీపరిశ్రమ మరో ప్రపంచాన్ని నిర్మించుకోబోతుంది. దీనికి ప్రముఖ నిర్మాత, సురేష్ మూవీస్ అధినేత దగ్గుపాటి సురేష్ అంకురార్పణ చేయనున్నట్లు సమాచారం. కొన్నిరోజుల క్రితం ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆంధ్రప్రదేశ్‌లో సినీపరిశ్రమ ఏర్పాటుకు తడ ప్రాంతం అనువైనదిగా చెప్పారు.

ఒకప్పుడు తెలుగు సినీపరిశ్రమ అంతా కూడా చెన్నైలో ఉండేది. ఆంధ్రప్రదేశ్ భాషాప్రయుక్త రాష్ట్రంగా ఏర్పాటైన తర్వాత కూడా దాదాపు 30ఏళ్ల పాటు తెలుగు ఇండస్ట్రీ చెన్నైలోనే నడిచింది. మాజీముఖ్యమంత్రులు స్వర్గీయ మర్రి చెన్నారెడ్డి, స్వర్గీయ నందమూరి తారకరామారావులు తెలుగు సినీపరిశ్రమ చెన్నై నుండి హైదరాబాద్ తరలి రావడానికి ఎంతగానో సహకరించారు. గత 30ఏళ్లలో హైదరాబాద్ కేంద్రంగా తెలుగు సినీపరిశ్రమ ఎంతగానో అభివృద్ధి చెందింది. అంతర్జాతీయ ప్రమాణాలుగల రామోజీ ఫిలింసిటీ వంటివి కూడా వచ్చాయి. దేశంలో బాలీవుడ్ తర్వాత టాలీవుడ్‌దే హవా అయ్యింది. సినీపరిశ్రమలో వేలకోట్ల రూపాయల టర్నోవర్ జరగసాగింది.

ఇప్పుడు రాష్ట్ర విభజన చిచ్చు తెలుగు సినీపరిశ్రమకు తాకింది. తెలుగు సినీపరిశ్రమలో సీమాంధ్ర వారిదే హవా. అందులోనూ కోస్తా వాళ్లే ఎక్కువుగా వున్నారు. హీరోలు, దర్శకులు, నిర్మాతలు, నటీనటులు, సాంకేతిక నిపుణులు... దాదాపు 90శాతం మంది కోస్తా వాళ్ళే! సినీ పరిశ్రమ వర్గాల్లో కూడా తెలంగాణ, ఏపి అనే తేడాలొచ్చాయి. అయితే నిర్మాతలలో కొందరు హైదరాబాద్‌లోనే ఉండిపోయేందుకు ప్లాన్‌లు వేస్తూ కేసీఆర్‌కు బానిసలుగా మారేందుకు సంసిద్ధులవుతున్నారు. వీరిలో మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌తో పాటు మరికొందరు కూడా వున్నారు. హైదరాబాద్‌లో వీరికి భారీగా ఆస్తులున్నాయి. అందుకే వీళ్లు హైదరాబాద్‌ను వదిలి రావడానికి ఇష్టపడడం లేదు. వీళ్లు మాత్రం కేసీఆర్ తన్నినా, తిట్టినా అక్కడే పడుండాలనే ధోరణిలో ఉన్నారు.

కాని కొంచెం పౌరుషం, ముందుచూపు ఉన్న సురేష్ లాంటి నిర్మాతలు మాత్రం సినీ పరిశ్రమను ఏపికి తీసుకురావాలని భావిస్తున్నారు. ఏపిలోని వైజాగ్‌లో అయితే సినీపరిశ్రమకు అనువుగా ఉంటుందనే అభిప్రాయం మొదటినుండి ఉంది. ఇప్పటికే సగం తెలుగు సినిమాల షూటింగ్‌లు విశాఖ, ఉభయగోదావరి జిల్లాల్లోనే జరుగుతున్నాయి. సురేష్ మాత్రం వైజాగ్ కంటే నెల్లూరుజిల్లా తడ ప్రాంతం సినీ పరిశ్రమ ఏర్పాటుకు అనుకూలమైనదిగా భావిస్తున్నట్లు సమాచారం. తడ వద్ద ప్రకృతి అందాలున్నాయి. (మిగతా 10వ పేజీలో)



# నెల్లూరుకిదో వైద్యవరం!

## 19న చంద్రబాబు, వెంకయ్యల చేతుల మీదుగా ప్రారంభం కానున్న ప్రభుత్వ వైద్యకళాశాల

అనుమానాలు పటాపంచలయ్యాయి. నెల్లూరులో వైద్య కళాశాల ప్రారంభానికి మార్గం సుగమమైంది. నెల్లూరులోని పెద్దాసుపత్రి ప్రాంగణంలో అత్యంత అధునాతనంగా, అత్యంత వేగంగా నిర్మించిన ప్రభుత్వ వైద్యకళాశాలను ఈ నెల 19వ తేదీన కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి యం.వెంకయ్యనాయుడు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణలు ప్రారంభించారు. మొదటి సంవత్సరం 150మంది వైద్య విద్యార్థులతో ఈ కళాశాల ప్రారంభమవుతుంది. ఈ వైద్యకళాశాలకు అనుబంధంగా సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, ఇతర వైద్య విభాగాల నిర్మాణాలు కూడా వేగవంతంగా జరుగుతున్నాయి. నెల్లూరులో ప్రభుత్వ వైద్యకళాశాల దశాబ్దాల కల. గత తెలుగుదేశం ప్రభుత్వంలో నెల్లూరుకు ప్రైవేట్ రంగంలో నారాయణ మెడికల్ కాలేజీ వచ్చింది. అయితే ప్రభుత్వ కాలేజీ మాత్రం రాలేదు. ముఖ్యమంత్రిగా పని చేసిన ఈ జిల్లా నాయకుడు స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కూడా ప్రభుత్వ వైద్యకళాశాలను సాధించలేకపోయారు. కాని గత ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రిగా పనిచేసిన ఆనం రామనారాయణరెడ్డి కృషితో నెల్లూరుకు ప్రభుత్వ వైద్యకళాశాల మంజూరయ్యింది. 365కోట్లతో ఎంతో అందంగా వైద్యకళాశాల భవనాలను తీర్చిదిద్దారు.

## వచ్చిన పోర్టును వద్దంటారా?

మా జిల్లాలో రాజధాని కావాలి, మా జిల్లాకు ఐ.టి ప్రాజెక్ట్ కావాలి, పోర్టు కావాలని రాజకీయ నాయకులు పోరాడుతున్నారు. కాని నెల్లూరుజిల్లా తెలుగుదేశం నాయకులు మాత్రం జిల్లాలోని దుగరాజపట్నం వద్ద మంజూరైన అతిపెద్ద పోర్టును మాత్రం ప్రకాశం జిల్లా రామాయపట్నంకు తరలించాలని కోరడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా ప్రజలు ఆగ్రహం చెందుతున్నారు.

గత యూపిఏ ప్రభుత్వంలోనే దుగరాజట్నం పోర్టు మంజూరైంది. దీనికి గెజిట్ నోటిఫికేషన్ కూడా వెలువడింది. అయితే దీనికి సమీపంలో షార్‌సెంటర్, పులికాట్ సరస్సు ఉండడంతో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. షార్ సెంటర్ భద్రత కంటే పోర్టు ముఖ్యం కాదు. ఇక పోర్టు నిర్మాణం వల్ల పులికాట్ సరసుకు వచ్చే ముప్పేమీ లేదు. అయినా ఈ అభ్యంతరాల నేపథ్యంలో పోర్టును దుగరాజపట్నం వద్ద కాకుండా తూపిలిపాలెం వద్ద నిర్మించాలని నిర్ణయించారు. అయినా కూడా దీనికి గ్రహణం వీడడం లేదు. పోర్టును ఇక్కడే నిర్మించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. త్వరలో విశాఖ-చెన్నై కారిడార్ రాబోతుంది. దుగరాజపట్నం కూడా దీని పరిధిలోకి వస్తుంది. ఈ పోర్టు వస్తే గూడూరు, నాయుడుపేట డివిజన్‌లలో అభివృద్ధి జరుగుతుంది. కేంద్రం ఈ పోర్టును తరలించే విషయమై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. కాని జిల్లా తెలుగుదేశం నాయకులు మాత్రం వచ్చిన పోర్టును వద్దంటుండడం విచిత్రంగా ఉంది.

# జడ్పీ ఎన్నిక... కంపుకంపు!

**ఎత్తులు, పైఎత్తులు, మ్యాజిక్ ఫిగర్ మార్పులు, అరుపులు, కేకలు, నిరసనలు, సమావేశంలో 44మంది సభ్యులున్నా అధికారికంగా కోరం లేకపోవడం... ఫలితంగా నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్మెన్ ఎన్నిక మరోసారి వాయిదా పడింది. కేసులు, విచారణలు, బెదిరింపులు వంటి సంఘటనల మధ్య ఇప్పుడు రాష్ట్రంలోనే నెల్లూరు జడ్పీ ఛైర్మెన్ ఎలక్షన్ ఒక హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్ర ఎన్నికల సంఘానికి, జిల్లా అధికార యంత్రానికి ఈ ఎన్నిక వ్యవహారం పెద్ద ప్రహసనంగా మారింది.**



జిల్లా కలెక్టర్‌తో సంతకం చేయలేనని చెప్తున్న వైకాపా జడ్పీటీసీ పెంచలమ్మ

ఈ నెల 13వ తేదీ నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఛైర్మెన్ ఎన్నిక కోరం లేని కారణంగా మరోసారి వాయిదా పడింది. ఎన్నికల సంఘం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 5వతేదీ మొదటిసారి జడ్పీ ఛైర్మెన్ ఎన్నికను నిర్వహించారు. అయితే ఆరోజు తెలుగుదేశంకు తగిన సంఖ్యాబలం లేదు. మొత్తం 46జడ్పీటీసీలలో తెలుగుదేశంకు 15, వైసిపికి 31ఉన్నాయి. వాటిలో ఆరు మంది వైసీపీ జడ్పీటీసీలు తెలుగుదేశం వైపుకు వెళ్లారు. అయినా ఆరోజుకు వైసిపికి 25మంది, తెలుగుదేశంకు 21మంది ఉన్నారు. దాంతో ఆరోజు తెలుగుదేశం నాయకులు వ్యూహాత్మకంగా గొడవ సృష్టించి ఛైర్మెన్ ఎన్నికను వాయిదా వేయించగలిగారు. ఆ సమావేశంలోనే మనుబోలు జడ్పీటీసీ తిరివీధి రమేష్‌ను తమ వైపు లాగేసుకున్నారు. దీంతో వైసిపి 24, తెలుగుదేశం 22 సంఖ్యతో నిలిచింది. అధికారపార్టీ నుండి తమ సభ్యులను కాపాడుకోవడానికి వైకాపా నాయకులు ఇడుపులపాయలో క్యాంపు పెట్టారు. అయినా అధికార పార్టీ వాళ్లు వారిని వదల్లేదు. ఇద్దరు జడ్పీటీసీలపై వారి కుటుంబ సభ్యులు కిడ్నాప్ కేసులు పెట్టారంటూ అక్కడకు పోయి కూడా సోదాలు చేసొచ్చారు.

ఎన్నికల సంఘం ఈ నెల 13న నెల్లూరు జడ్పీ ఛైర్మెన్ ఎన్నికకు ముహూర్తం ఖరారు చేసింది. 5వ తేదీ సమావేశంలో జరిగిన దృశ్యాలను చూసి సీరియస్‌గా తీసుకున్న ఎన్నికల సంఘం ఈసారి ఎన్నిక నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టింది. సీనియర్ ఐఏఎస్ అధికారి రామాంజనేయులును అబ్జర్వర్‌గా పంపింది. ఇక నలుగురు డిఎస్పీలు, 20 మంది సిఐలు, 600మంది పోలీసు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసారు.

13వ తేదీ మధ్యాహ్నం సమావేశం మొదలైంది. ఇందుకూరుపేట జడ్పీటీసీ వెంకటరమణయ్య గైర్హాజరయ్యారు. కావలి జడ్పీటీసీ పెంచలమ్మను కుటుంబసభ్యులు కేసు పెట్టారని చెప్పి విచారణ కోసం పోలీసులు బయటకు తీసుకెళ్లారు. ఆమె కుటుంబసభ్యులతో మాట్లాడించారు. తెలుగుదేశంకు అనుకూలంగా ఓటేయాలని వారంతా ఆమెపై ఒత్తిడి తెచ్చారు. కాని ఆమె వినలేదు. చివరకు ఆమెను ఎవరికీ ఓటు వేయకుండా పోవడానికి ఒప్పించుకున్నారు. కలెక్టర్ ఆదేశాలతో పెంచలమ్మను సమావేశ మందిరంలో ప్రవేశపెట్టారు. తనకు ఆరోగ్యం బాగాలేదని, సంతకం చేయలేనని, తనకు విశ్రాంతి కావాలని చెప్పి ఆమె అక్కడ నుండి నిష్క్రమించారు. దీంతో వైసిపి సభ్యులు 22 మందే అయ్యారు. తెలుగుదేశం స్కోర్ కూడా అంతే ఉంది. కాని వైసిపి సభ్యులే సంతకాలు చేసారు. తెలుగుదేశం సభ్యులు సంతకాలు చేయకపోవడంతో కోరం సరిపోలేదు.

పెంచలమ్మ వచ్చి సంతకం చేసుంటే కోరం సరిపోయేది, ఎన్నిక జరిగి ఉండేది. కాని ఆమె సంతకం చేయకపోవడంతో ఎన్నిక మరోసారి వాయిదా పడింది. ఎన్నిక వాయిదా పడడంతో తెలుగుదేశం సభ్యుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

**జంప్ జిలానీలకు చిక్కు :** ఎన్నికల నిర్వహణను కట్టుదిట్టం చేయడంతో జంప్ జిలానీలకు పెద్ద సమస్యను తెచ్చిపెట్టింది. ఈసారి పార్టీల వారీగా సభ్యులు కూర్చోవడానికి బారికేడ్లు ఏర్పాటు చేసారు. వైసిపి నుండి తెలుగుదేశంలోకి జంప్ చేసిన సభ్యులకు వైసిపి సభ్యుల మధ్య కూర్చోవడం ఇబ్బంది కరంగా మారింది. మేము వారి మధ్య కూర్చోలేమని వీళ్లు మొండికేసారు. కలెక్టర్ మాత్రం మీరు ఎవరికి చేయెత్తినా, మీకు కేటాయించిన సీట్లలోనే కూర్చోవాలని స్పష్టం చేసారు. దీంతో సభ వాయిదా పడే వరకు కూడా వాళ్లు అలాగే నిలబడి వున్నారు.

**నేతల్లో, అధికారుల్లో అసహనం:** అధికారపార్టీ ఆగడాల వల్ల ఎన్నిక వాయిదా పడుతుండడంతో వైకాపా నాయకులు, అధికారులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ఇంత చెత్త ఎలక్షన్‌ను ఎప్పుడూ చూడలేదని అసహ్యించుకుంటున్నారు.

### విశాఖ - చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో

# నెల్లూరుజిల్లాకు ప్రాధాన్యత

## రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖామంత్రి పి.నారాయణ



కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన బడ్జెట్‌లో 'విశాఖపట్నం - చెన్నై పారిశ్రామిక కారిడార్'ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక, ఆర్థిక, మౌళిక రంగాలకు ఎంతో ఊతమిచ్చిందని రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మన రాష్ట్ర దీర్ఘకాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతో విజ్ఞతతో చేసిన ప్రతిపాదనల మేరకు, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి యం.వెంకయ్యనాయుడు తీసుకున్న చొరవ మేరకు ఈ కారిడార్ ప్రకటనను కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో పొందుపరిచింది. ఈ కారిడార్ ఏర్పాటులో భాగంగానే కాకినాడ పోర్టును 'హార్డ్‌వేర్ హబ్'గా మరియు నెల్లూరుజిల్లాలోని కృష్ణపట్నం పోర్టును 'ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ'గా కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్‌లో ప్రకటించారు. కారిడార్ పూర్తిస్థాయిలో ఏర్పాటయితే తీరప్రాంతంలోని ఓడరేవులు, పట్టణాలు, నగరాలతో పాటు మరీ ముఖ్యంగా నెల్లూరు నగరం, జిల్లాలోని ఇతర ప్రాంతాలు గణనీయమైన అభివృద్ధి సాధిస్తాయి.

నెల్లూరుజిల్లాకు సుమారు 150కిలోమీటర్ల తీర ప్రాంతంతో పాటు దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న కృష్ణపట్నం పోర్టుతో పాటు మరో పోర్టు దుగరాజపట్నం ఉన్నాయి. ఈ రెండు పోర్టులు కారిడార్‌లో ఎంతో కీలకంగా మారి అభివృద్ధి చెందడం వల్ల జిల్లాలో పారిశ్రామిక, ఆర్థిక, ఉపాధి రంగాలు భారీస్థాయిలో అభివృద్ధి అవుతాయి. కేంద్రప్రభుత్వం సహకారంతో దేశంలో నిర్మించనున్న 100స్మార్ట్ సిటీలలో నెల్లూరు నగరం ఒకటిగా ఉంటుంది.

**దేశంలోనే విశిష్ట కారిడార్ ఇది...** విశాఖ - చెన్నై పారిశ్రామిక కారిడార్ దేశంలోనే అత్యంత విశిష్టమైనది. సుమారు వెయ్యి కిలోమీటర్ల తీర ప్రాంతంలో రెండు మేజర్ పోర్టులైన విశాఖపట్టణం - చెన్నైలను అనుసంధానం చేస్తూ వాటి మధ్యలో ఉన్న 14 నాన్-మేజర్ పోర్టులను లింక్ చేయడం ఒక వినూత్న ప్రయోగం. దేశంలో మరెక్కడా ఇలాంటి ప్రయోగం జరగలేదు. ఈ కారిడార్ ఏర్పాటు వల్ల రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాలు ప్రయోజనం పొందుతాయి. ముఖ్యంగా నెల్లూరుజిల్లా ఎంతో కీలక ప్రాంతంగా మారుతుందనడంలో సందేహం లేదు. జిల్లాలోని రెండు పోర్టులు భారీ స్థాయిలో అభివృద్ధి అవుతాయి. కారిడార్‌లో భాగంగా వివిధ పారిశ్రామిక, ఉత్పత్తి, సర్వీసుసంస్థలు ఏర్పాటుతో ఎగుమతులు, దిగుమతులు పెరుగుతాయి. దీనివల్ల మన నెల్లూరు జిల్లాతో పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు గణనీయంగా మెరుగుపడతాయని పెట్రో కెమికల్స్, గ్యాస్, ఫార్మాసూటికల్స్, మాంగనీస్, ఐరన్‌ఓర్, కంప్యూటర్ ఆధారిత పరిశ్రమలు ఈ కారిడార్‌లో ఏర్పాటు కావడానికి అవకాశాలున్నాయని ఆయన తెలిపారు.

# వ్యక్తిత్వంతోనే విజయం



ఒక మనిషి పట్ల ప్రజల్లో సానుకూల దృక్పథం ఉంటే ఎటువంటి ఫలితముంటుందనే దానికి సూళ్లూరుపేట ఒక ఉదాహరణ. 2014ఎన్నికల్లో సూళ్లూరుపేట అసెంబ్లీ నుండి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా కిలివేటి సంజీవయ్య గెలుపొందారు. ఇది ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గం. కిలివేటి సంజీవయ్య కాకలు తీరిన రాజకీయ నాయకుడు కాదు. తలపండిన రాజకీయ అనుభవజ్ఞుడు కూడా కాదు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ స్వచ్ఛంద విరమణ చేసారు. సంజీవయ్య సాధారణ ఉద్యోగిగా వుంటే ప్రత్యేక గుర్తింపు వచ్చేది కాదు. మాజీమంత్రి పసల పెంచలయ్యకు అల్లుడు కావడమే సంజీవయ్యకు సూళ్లూరుపేట ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చింది. దళిత వర్గాలకు చెందిన నాయకుడైన పెంచలయ్యకు ఈ నియోజకవర్గంలో మంచిపేరుంది. అదేవిధంగా సంజీవయ్యకు వ్యక్తిపరంగా మంచివాడనే పేరుంది. మాజీఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం మొదటి నుండి ఈ సీటును ఆశిస్తూ వచ్చారు. అయితే ఆయన మీద గతంలో ఎన్నో వివాదాలు, ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జగన్ దృష్టి సంజీవయ్య మీద పడింది. పసల పెంచలయ్య గురించి కూడా తెలుసుకున్నాడు. మామా అల్లుళ్లిద్దరినీ పార్టీలోకి చేర్చుకున్నారు. సూళ్లూరుపేట సీటును సంజీవయ్యకే ఖరారు చేసారు. తెలుగుదేశంకు ఓ పక్క వేనాటి రామచంద్రారెడ్డి, కాంగ్రెస్‌కు ఇంకో పక్క వాకాటి నారాయణరెడ్డి వంటి అగ్రనేతల అండదండలుండి, తనకు ఆ స్థాయి సహకారం లేకున్నా బాగా కష్టపడ్డాడు. తెలుగుదేశంకు కంచుకోటలాంటి సూళ్లూరుపేటలో వైకాపా జెండా ఎగురవేసాడు.

## కురుగొండ్ల ర్యాలీ

ఈ నెల 5న జిల్లా పరిషత్ ఛైర్మెన్ ఎన్నిక సందర్భంగా జడ్పీ హాల్‌లో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వ్యవహరించిన తీరుపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదైంది. కలెక్టర్ పట్ల ఆయన అనుచిత ప్రవర్తనను నిరసిస్తూ నెల్లూరులో రెవెన్యూ ఉద్యోగులు కూడా ఆందోళనలు నిర్వహించారు. పోలీసులు ఆయనను అరెస్ట్ చేయాలంటూ బేడీలు పట్టుకుని ఆయన లేని చోటల్లా వెదికారు. ఆయన ఎక్కడో తప్పించుకొని తిరుగుతున్నాడనే ప్రచారం నేపథ్యంలో ఈ నెల 12న హైదరాబాద్ నుండి నెల్లూరొచ్చారు. రైల్వేస్టేషన్‌లో దిగారు. అక్కడ నుండి ఆయన గెస్ట్‌హౌస్ దాకా కార్ల ర్యాలీ జరిగింది. అక్కడ టిఫిన్, ఇతర కార్యక్రమాలు ముగించుకున్నాక ఒకటో నగర పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయారు. అక్కడే స్టేషన్ బెయిల్ పొంది బయటకొచ్చారు.

# మేయర్ పార్టీ మారేనా?

***నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ షేక్ అబ్దుల్ అజీజ్ తెలుగుదేశంలో చేరుతారనే ప్రచారం విస్తృతంగా జరుగుతుంది. పక్కాగా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులే ఈ విషయాన్ని చెబుతున్నారు. మేయర్‌గా ఎన్నిక కావడానికి ముందే అజీజ్ తెలుగుదేశం నాయకులతో పార్టీలో చేరడానికి ఒప్పందం కుదుర్చుకున్నాడని, ఈమేరకు ఈ నెలాఖరులోపే తెలుగుదేశంలో చేరే అవకాశాలున్నాయనేది సమాచారం.***



స్టార్ హేచరీ అజీజ్‌గా పరిచయమైన అజీజ్ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ద్వారానే రాజకీయంగా తెరమీదకొచ్చాడు. వైకాపాలో చేరక మైనార్టీ వర్గాల నుండి నెల్లూరు నగరం అసెంబ్లీ సీటును ఆశిస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే తన సొంతంగా ఛారిటబుల్ ట్రస్ట్‌ను నెలకొల్పి, దానిద్వారా కొన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే నెల్లూరు నగరం సీటును ముందుగానే పి.అనిల్‌కుమార్‌యాదవ్‌కు కేటాయించడంతో ఒక దశలో అజీజ్ తెలుగుదేశం పార్టీలో చేరాలనే ఆలోచన కూడా చేసారు. ఈ విషయంలో ముందుగా మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిని కూడా సంప్రదించారు. అయితే అసెంబ్లీ ఎన్నికల లోపే నగరపాలక సంస్థ ఎన్నికలు రావడం, వైకాపా మేయర్ అభ్యర్థిగా అజీజ్‌నే ప్రకటించడంతో ఆయన వైకాపాలో ఉండిపోయారు. అయితే ఎన్నికల సమయంలో నెల్లూరు నగరం, రూరల్ సమన్వయకర్తలుగా ఉన్న అనిల్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలతో ఆయనకు విభేదాలు పొడసూపాయి. అయినా వాళ్ళు వాటిని పక్కన పెట్టి అన్ని డివిజన్‌లలో వైకాపా అభ్యర్థుల గెలుపుకు కృషి చేసారు. నగరపాలక సంస్థ ఎన్నికల్లో వైకాపాకు 32డివిజన్లు వచ్చాయి. దీంతో పూర్తి మెజార్టీ వచ్చినట్లయ్యింది.

అయితే మేయర్ ఎన్నికకు ముందే అసెంబ్లీ ఫలితాలు రావడం, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో నెల్లూరు నగర రాజకీయం కొంత మారింది. తెలుగుదేశం అధికారంలో ఉండడంతో తన మేయర్ పదవికి ఎక్కడ ఎసరుపెడతారోనని భావించిన అజీజ్ ముందుగానే హైదరాబాద్‌కు వెళ్లి మంత్రి నారాయణను, ఇంకొందరు తెలుగుదేశం ముఖ్యనేతలను కలిసి మేయర్ అయ్యాక తెలుగుదేశంలో చేరుతాననే ప్రతిపాదన చేసినట్లు సమాచారం. ఒక దశలో అజీజ్ రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవి ఏదన్నా ఇస్తే మేయర్ పదవిని కూడా వద్దనుకోవడానికి సిద్ధపడ్డట్లు సమాచారం. అయితే తెలుగుదేశం అధినాయకుల నుండి గట్టి హామీ ఏదీ రాకపోవడంతో మేయర్ బరిలో నిలిచాడు. మేయర్ అయ్యాక ఎలాగూ అజీజ్ తెలుగుదేశంలో చేరుతాడు కాబట్టి తెలుగుదేశం నాయకులు గాని, మంత్రి గాని మేయర్ ఎన్నిక విషయంలో తమ అభ్యర్థిని మేయర్‌ను చేసుకునే విధంగా గట్టి పట్టు పట్టలేదు. అజీజ్ నుండి ఇలాంటి ప్రతిపాదన లేకపోయివుంటే జడ్పీ ఛైర్మెన్ మాదిరిగానే మేయర్ పదవి విషయంలోనూ తెలుగుదేశంవాళ్లు అధికార బలప్రయోగానికి దిగుండేవాళ్లు. అజీజ్ తెలుగుదేశంలోకి వస్తానన్నాడు కాబట్టే మేయర్ ఎన్నికప్పుడు ఆయనను చూసీచూడనట్లు వదిలేసారు. ముందుగా కుదిరిన ఒప్పందం ప్రకారమే అతిత్వరలో అజీజ్ తెలుగుదేశంలో చేరొచ్చని విశ్వసనీయ సమాచారం.

## వెంకయ్య కోసం..

# ముస్తాబైన నగరం

ప్రధాని నరేంద్ర మోడీ మంత్రివర్గంలో అత్యంత కీలకమైన కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా ఈ నెల 18న నెల్లూరుకు వస్తున్న బీజేపీ జాతీయ నాయకులు యం.వెంకయ్యనాయుడుకు స్వాగతం చెప్పేందుకు నెల్లూరు నగరం ముస్తాబైంది. నెల్లూరంతా కూడా వెంకయ్యకు స్వాగతం చెబుతున్న ఫ్లెక్సీ కటౌట్‌లతో కళకళ లాడుతుంది. వాజ్‌పేయి ప్రభుత్వంలో తొలిసారి కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టి వెంకయ్య నెల్లూరుకు వచ్చినప్పుడు కంటే కూడా ఇప్పుడు ఇంకా ఎక్కువ హంగామా కనిపిస్తుంది. పార్టీలకు అతీతంగా, కులాలు, మతాలకు అతీతంగా చాలామంది వెంకయ్యకు స్వాగత సన్నాహాలలో పాలుపంచుకుంటున్నారు.

వెంకయ్య మూడురోజుల పాటు జిల్లాలో జరిగే కార్యక్రమాలలో పాల్గొననున్నారు. 18వ తేదీ మధ్యాహ్నం రేణిగుంటకు చేరుకుని రోడ్డు మార్గాన నెల్లూరుకు బయలుదేరుతారు. శ్రీకాళహస్తి, నాయుడుపేట, ఓజిలి, గూడూరు వంటి ప్రాంతాలలో బీజేపీ కార్యకర్తలు వెంకయ్యను ఆపి సన్మానించనున్నారు. నెల్లూరులోని బుజబుజనెల్లూరు నుండి మినీబైపాస్‌లోని బీజేపీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ జరుగుతుంది. ఆరోజు అనిల్ గార్డెన్స్‌లో బీజేపీ కార్యకర్తలు నిర్వహించే పౌరసన్మానసభలో పాల్గొంటారు. అదేరోజు రాత్రి ఆయన వెంకటాచలంలోని అక్షర స్కూల్‌ను, స్వర్ణభారత్‌ట్రస్ట్‌ను సందర్శిస్తారు. 19వతేదీ ఉదయం రైల్వేస్టేషన్‌లో ఎస్కలేటర్‌ను ప్రారంభిస్తారు. ఆరోజు నెల్లూరు పెద్దాసుపత్రి ప్రాంగణంలో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభోత్సవంలోనూ, రాత్రి విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే పౌరసన్మాన కార్యక్రమంలోనూ పాల్గొంటారు. 20వ తేదీ ఉదయం నెల్లూరు నుండి తిరుపతికి బయలుదేరి మార్గమధ్యంలో గూడూరులో ఆగి కనుమూరు హరిశ్చంద్రారెడ్డి చారిటబుల్‌ట్రస్ట్ వారు చేపట్టిన అలఘునాథస్వామి ఆలయం కోనేరు పునరుద్ధరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

వెంకయ్య పర్యటనను విజయవంతం చేసేందుకు బీజేపీ కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా ఉన్నారు.

# నెల్లూరుకు చేయూతనివ్వండి



నెల్లూరు నగరాభివృద్ధికి మీ ఆశీస్సులు అవసరమని మేయర్ షేక్ అబ్దుల్ అజీజ్ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి యం.వెంకయ్యనాయుడిని కోరారు. అజీజ్ సోమవారం ఢిల్లీలో వెంకయ్యనాయుడిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నెల్లూరు నగర అభివృద్ధిపై వెంకయ్యనాయుడుతో చర్చించారు. నెల్లూరులో భూగర్భడ్రైనేజీ, పారిశుద్ధ్యం, తాగునీరు, రింగురోడ్డు వంటి విషయాలను వెంకయ్య నాయుడుతో మాట్లాడారు.

# సాకారమవుతున్న స్వప్నం

**- వైద్యకళాశాల ఏర్పాటుపై ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హర్షం**



దాదాపు యాభై ఏళ్ళుగా జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్న ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటు జరుగుతుండడం ఎంతైనా సంతోషకరమని, ఇన్నాళ్ళనాటి ప్రజల స్వప్నం సాకారం అవుతోండడం హర్షదాయకమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈనెల 16న ఆయన నగరంలోని ప్రభుత్వ వైద్యకళాశాలను సందర్శించారు. నెల్లూరులో ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటు కోసం తాము విద్యార్థి దశ నుంచే ఆందోళనలు చేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆ కల ఇప్పుడు నెరవేరుతోందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ నెల 19వ తేదీన కేంద్రమంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రులు కామినేని శ్రీనివాస్, పి. నారాయణ తదితరులు ముఖ్యఅతిథులుగా విచ్చేసి ఈ కళాశాలను ప్రారంభిస్తారని, అత్యంత ఆధునికమైన సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కళాశాల ప్రారంభమవుతోందని, ఈ కళాశాల నిర్మాణానికి కృషి చేసిన వారందరికీ ధన్యవాదాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, పలువురు కార్పొరేటర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



గురుపౌర్ణమి సందర్భంగా ఈ నెల 12న నెల్లూరు నగరంలోని సాయినాధుని ఆలయాల్లో అత్యంత వేడుకగా ఉత్సవాలు నిర్వహించారు. ఓం సాయి.. శ్రీ సాయి.. జయజయ సాయి అంటూ ఎంతో భక్తిశ్రద్ధలతో భక్తులు ఈ వేడుకల్లో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయి నాధుని ఆలయాలతో పాటు దత్తసాయి మందిరాలు, వైష్ణవ ఆలయాలు, తదితర అనేక ఆలయాల్లో గురుపూర్ణిమ వేడుకలు కోలాహలంగా జరిగాయి. నగరంలోని ట్రంకురోడ్డు వద్ద వున్న శ్రీ సాయినాధుని మందిరం వేలాదిగా విచ్చేసిన భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు కేంద్రసహకార బ్యాంక్ ఆవరణలో రామాయణంలోని సుందరకాండ సప్తాహం ప్రారంభించారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి ఈ కార్యక్రమాలన్నిటిలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు మన్నెం అమరనాథరెడ్డి, పైడిపాటి సుధాకరరావు, కొల్లి శ్యామసుందరరెడ్డి, దువ్వూరు జయమ్మ తదితరులు ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. అదే విధంగా, ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని మాచవోలు రమేష్‌శర్మ నివాసంలో విశాఖ పట్నం సౌభాగ్య భువనేశ్వరీదేవి పీఠాధిపతి రామానందభారతి ఆధ్వర్యంలో వ్యాస పూజ, క్షీరాభిషేకం కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. బాలాజీనగర్ శివారుల్లో వున్న పద్మావతినగర్‌లోని సాయిబాబా అద్దాల మందిరంలో గురుపూర్ణిమ వేడుకలు వైభవంగా నిర్వహించారు. అఖండసాయి నామ సంకీర్తనలతో పాటు, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిల్డ్రన్స్ పార్క్ సమీపంలోని సాయిసదన్‌లోనూ, నిప్పోసెంటర్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలోనూ, ఏసి మార్కెట్ సెంటర్‌లో వున్న సాయిబాబా మందిరంలోనూ, ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని శ్రీ సాయిబాబా మందిరంలోనూ ఇలా అన్ని ఆలయాల్లో స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో ఈ సందర్భంగా పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు.

## విద్యార్థులు తమ...

# శక్తిసామర్థ్యాలను సద్వినియోగం చేసుకోవాలి

**- ప్రముఖ గుండెవైద్యనిపుణులు డా॥ శ్రీనివాసరాజు**



నెల్లూరు కొండాయపాళెంరోడ్డులో జనహిత-వాత్సల్య సేవాసంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న భారతీయ విద్యావికాస్ ఇంగ్లీషు మీడియం హైస్కూలులో ఈ నెల 17న "ఫ్రెషర్స్‌డే" ఆహ్లాదకరంగా జరిగింది. స్కూలులోని విద్యార్థులు తమ ప్రతిభతో చక్కగా తయారుచేసి ప్రదర్శించిన మోడల్స్ అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ప్రముఖ గుండెవైద్య నిపుణులు డా॥ సి.ఎస్.శ్రీనివాసరాజు, రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ ఇన్‌ఛార్జి డా॥ ఈదూరు సుధాకర్, ఆర్‌టిఓ రాం ప్రసాద్‌లు పాల్గొన్నారు. డా॥ శ్రీనివాసరాజు మాట్లాడుతూ భగవంతుడు ప్రతి ఒక్కరికి సమానమైన శక్తిసామర్థ్యాలు ఇచ్చాడని, కొందరు వాటిని చక్కగా ఉప యోగించుకొని మంచి అభివృద్ధిని సాధి స్తున్నారని, మరికొందరు వాటిని దుర్విని యోగం చేసుకొని తమ జీవితాలను పాడుచేసుకుంటున్నారని అన్నారు. అందు చేత పిల్లలు తమ శక్తిసామర్థ్యాలను సద్వినియోగపరుచుకొని తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకొంటూ జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని పేర్కొన్నారు.

సభకు జనహిత-వాత్సల్య గౌరవాధ్యక్షులు సామంతు గోపాల్‌రెడ్డి అధ్యక్షత వహించారు. పిరమిడ్ స్పిరుచ్యువల్ సెంటర్ కో-ఆర్డినేటర్ జనార్దనసెట్టి, స్కూలు కరస్పాండెంట్ జి.వి.సాంబ శివరావు, ఆం.ప్ర. వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.జయప్రకాష్, జనహిత-వాత్సల్య కమిటీ సభ్యులు బి.వి.ఎస్.బాబు, స్కూలు ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# 'ప్రభా'తం

ఎట్టకేలకు.. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడానికి వున్న అవాంతరాలు, అభ్యంతరాలన్నీ ఉభయసభల ఆమోదముద్రతో ఒక కొలిక్కి రావడం.. నిజంగానే ఒక శుభ పరిణామం. ఆంధ్రప్రదేశ్‌కు ఇది ఎంతైనా.. కొంత ఉపశమనం.

అధికారపక్షమైన బిజెపికి రాజ్యసభలో బలం తక్కువైనప్పటికీ, ఈ విషయంలో కాంగ్రెస్‌పార్టీ స్పష్టమైన మద్దతు ఇవ్వడంతో రాజ్యసభలోనూ ఈ బిల్లు ఎలాంటి ఇబ్బందిలేకుండా గట్టెక్కింది. పోలవరం ముంపు ప్రాంతాల తరలింపును తెలంగాణ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ, ఒరిస్సా, చత్తీస్‌ఘడ్ సభ్యులు కూడా కొంత అసహనం ప్రదర్శించినప్పటికీ, సీమాంధ్ర సభ్యులు గట్టిగా బిల్లును సమర్ధించడం, కాంగ్రెస్ కూడా బిల్లుకు ఓకే చెప్పడంతో బిల్లు ఆమోదానికి మార్గం సుగమమైంది. ఇక రాష్ట్రపతి ఆమోదముద్ర పడడమే తరువాయి. పోలవరం ముంపు ప్రాంతాలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనం అవుతాయి. గతంలో, అంటే 2005వ సంవత్సరంలోనే దాదాపు 10,521 కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. 7.2 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడం, కృష్ణా బేసిన్‌కు 80 టిఎంసిల నీరివ్వడం, విశాఖపట్నం జిల్లాకు కూడా మంచినీరు అందించడం ఈ ప్రాజెక్టు లక్ష్యాలు. అలాంటి బృహత్తర ప్రాజెక్ట్‌కు ఇప్పుడు ఉభయసభల ఆమోదముద్ర పడడంతో ఈ ప్రాజెక్టుకు జాతీయహోదా వచ్చినట్లే. ఒకవైపు రాష్ట్ర విభజనతో గుండెకాయ వంటి హైదరాబాద్‌ను కోల్పోయి, భారీ అప్పులతో, అనేకానేక కష్టనష్టాలతో ఒంటరి పోరాటం చేస్తూ, చివరికి రాజధాని ఎక్కడ నిర్మించుకోవాలో కూడా అర్ధం కాక సతమతమవుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఈ పరిణామం కొంత ఉపశమనం కలిగించేదనే భావించవచ్చు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే, దాదాపు ఏడు లక్షల ఎకరాలకు సాగు నీరు అందించవచ్చు. మరో పది లక్షల ఎకరాలను స్థిరీకరించవచ్చు కూడా. మరోవైపు విశాఖపట్నానికి తాగునీటి కొరత లేకుండా చూడవచ్చు. ఈ దృష్ట్యా పోలవరం మన ప్రాంత రైతాంగానికి, ప్రజలకు ఎంతో కీలకమైనది. అంతేకాదు, ఈ బృహత్తరమైన ప్రాజెక్టుకు, జాతీయప్రాజెక్టుగా, దేశంలో తొలి నదుల అనుసంధాన ప్రాజెక్టుగా మంచి గుర్తింపు కూడా వస్తుంది. కృష్ణా-గోదావరి నదుల అనుసంధానానికి ఎంతో ఉపకరించే ఈ ప్రాజెక్టు కింద సాగునీరుతో పాటు, సుమారు 960 మెగావాట్ల విద్యుదుత్పత్తిని కూడా చేయాలనే లక్ష్యం వుంది. ఈ నేపథ్యంలో, రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరం బహుళార్ధసాధక ప్రాజెక్టుకు సంబంధించి, ముంపు మండలాల్లోని నిర్వాసితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా పూర్తయ్యేందుకు గత మే 29వ తేదీన రాష్ట్రపతి జారీ చేసిన ఆర్డినెన్స్‌స్థానంలో రూపొందిన ఈ బిల్లుకు ఎట్టకేలకు ఉభయసభల ఆమోదముద్ర పడడం అందరికీ ఆనందం కలిగించే విషయమే. ఆ మేరకు ఈ బిల్లుపై ఈ నెల 14న దాదాపు మూడు గంటల పాటు రాజ్యసభలో సుదీర్ఘ చర్చే జరిగింది. అరుపులు, కేకలు, ఆందోళనలు, నిరసనల మధ్య ఎవరి వాదనలు వారు వినిపించారు. తెలంగాణ ప్రభుత్వాన్ని, శాసనసభను సంప్రదించకుండా ఈ బిల్లును తేవడం రాజ్యాంగ విరుద్ధమంటూ తెలంగాణా రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్, టిఆర్ఎస్ సభ్యులు వ్యతిరేకించారు. లక్షలాదిమంది గిరిజనులను నిరాశ్రయులను చేసే పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గించాలని, ప్రాజెక్ట్ డిజైన్ మార్చాలని పట్టు బట్టారు. అయితే, కాంగ్రెస్‌సభ్యుడు జైరాంరమేష్ ఈ బిల్లు పూర్వాపరాలను కూలంకుషంగా వివరిస్తూ, ఈ బిల్లు లక్షలాదిమంది ప్రజలకు ప్రయోజనకరమైనదని స్పష్టం చేశారు. గతంలో తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమేనంటూ బిల్లుకు గట్టిగా మద్దతునిచ్చారు. వాదోపవాదాల అనంతరం కేంద్రమంత్రి రాజనాథ్‌సింగ్ ఎంతో సంయమనంతో వ్యవహరించి, బిల్లు పూర్వాపరాలను సభ్యులకు విశ్లేషించిన తీరు ప్రజల మనసులను బాగా ఆకట్టుకుంది.

బిల్లు ప్రవేశపెట్టే విషయంలో తమ ప్రభుత్వం ఎక్కడా రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడలేదని, రాష్ట్రపతి ఆమోదం పొందినతర్వాతే ఉభయసభల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టామని ఆయన వివరించారు. మే 29న ఈ ఆర్డినెన్స్ జారీ అయినప్పటికీ, అప్పుడు రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన వుండడంతో అసెంబ్లీకి పంపలేక పోయామని, రాజ్యాంగం ప్రకారమే రాష్ట్రపతి ఆ బిల్లుకు ఆమోదం తెలిపారని స్పష్టం చేయడంతో సభలో ప్రశాంతవాతావరణం నెలకొంది. ఇది లక్షలాది మంది ప్రజలకు మేలు చేసే ప్రాజెక్టు అని, కేంద్రమే ఈ ప్రాజెక్టును అమలు చేస్తుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌ఘడ్, ఒడిస్సా రాష్ట్రాల్లో ముంపునకు గురయ్యే ఆదివాసీ గ్రామాల గురించి కూడా ఎంతో బాధ్యతతో ఆలోచించి, వారికి తగు నష్టపరిహారం చెల్లించేందుకు, పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అంతేకాదు, తమ ప్రభుత్వం ఎక్కడా ఎట్టి పరిస్థితుల్లోనూ అహంకార పూరితంగా వ్యవహరించదని, పూర్తి ప్రజాస్వామ్యయుతంగా, పేదల పట్ల సానుభూతితోనే వ్యవహరిస్తుందని, రాజకీయప్రయోజనాల కోసం తాము నిర్ణయాలు తీసుకునేది వుండదని స్పష్టం చేయడం ద్వారా కేంద్రప్రభుత్వ విధానాల తీరును, నిబద్ధతను ఆయన మరోసారి నిరూపించినట్లయింది.

ఏదేమైనా పోలవరం ముంపు ప్రాంతాల విలీనానికి మార్గం సుగమం కావడం ద్వారా ఈ బృహత్తర ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డంకులన్నీ తొలగిపోవడం ప్రజలకెంతో ప్రయోజనం కలిగించే విషయం. ఇప్పుడున్న కష్టకాలంలో ఈ పరిణామం ఎంతో శుభకరం. ఆంధ్రప్రదేశ్‌కు పోలవరం.. నిజంగా ఒక వరమే మరి!...

## పోల'వరం'



పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే, దాదాపు ఏడు లక్షల ఎకరాలకు సాగు నీరు అందించవచ్చు. మరో పది లక్షల ఎకరాలను స్థిరీకరించవచ్చు కూడా. మరోవైపు విశాఖపట్నానికి తాగునీటి కొరత లేకుండా చూడవచ్చు. ఈ దృష్ట్యా పోలవరం మన ప్రాంత రైతాంగానికి, ప్రజలకు ఎంతో కీలకమైనది.




## ఉత్త భద్రయ్యనే!

వీరభద్రయ్య అను పహిల్వాన్ కొండను మోస్తాడని గ్రామంలో చాటింపు జరిగింది. వేలంవెర్రిగా జనాలు తండోపతండాలుగా కొండను చేరుకున్నారు. ప్రజలారా కొండను ఎత్తి నా తల మీద పెట్టండి మోస్తాను అన్నాడు వీరభద్రయ్య. అప్పుడు తెలిసింది వాడు పచ్చి మోసగాడని ప్రజలకు. నాలుగు తగిలించారు. బాబోయ్ నన్ను కొట్టకండి నేను వీరభద్రయ్యను కాను ఉత్త భద్రయ్యనే అన్నాడు కాళ్ళ మీద పడి. అలా ఉంది రైతుల రుణమాఫీ ఫైలు మీద తొలిసంతకం చేసే సంగతి దాట వేసి రుణమాఫీ అమలుకు మార్గాలు సూచించమని విలేకరులను చంద్రబాబు అడగటం!

కురుగూరు రంగనాథం, నెల్లూరు.

## వై.యస్ పేరు నిలబెట్టాలి

ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలలో విపక్షనేతగా జగన్ వ్యవహరించిన తీరు ఆయన తండ్రి రాజన్నను గుర్తుకు తెచ్చింది. 1999 - 2004ల మధ్య వై.యస్. కూడా ప్రధాన ప్రతిపక్ష నేతగా ఎంతో చక్కగా పనిచేసి ప్రజల మనసులకు చేరువయ్యారు. ప్రతిపక్షనేతగా ప్రజల కష్టనష్టాలను దగ్గరగా చూడబట్టే ఆయన ముఖ్యమంత్రిగా సమర్ధవంతంగా రాణించారు. జగన్ కూడా తండ్రిబాటలోనే నడిచి ప్రజల కోసం పోరాడాలి.

*బి.ఆర్.శాలి, కావలి.*

## దేవుళ్ళ పేరుతో సమస్య

ద్వారక పీఠాధిపతి స్వరూపానందస్వామీజీ సాయిబాబాను ముస్లిం అని, ఆయనను దేవుడుగా కొలువ వద్దని చెప్పారు. మన కుళ్ళు రాజకీయాలు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కూడా పాకుతున్నాయి. భక్తులు ఆదాయం లేనిదే ఏ దేవుడ్ని కొలవరు. సాయిబాబా సెక్యులరిస్టు దేవుడు. అందరూ ఆయన పాదాలను తాకవచ్చు. కొన్ని గుళ్లలో దూరం నుండే దేవుడిని చూసి పోవాలి. ఏ దేవుడు మీద ఎవరి నమ్మకం వారిది. ఇలాంటి విషయాలను ఎవరు కూడా వివాదాస్పదం చేయకుంటే మంచిది.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## 'అంతర్'జాతీయం

- ఆర్థిక నేరాలను నియంత్రించే సంస్థలను సమన్వయపరిచే కేంద్ర ఆర్థిక నిఘా సంస్థ డైరక్టర్ జనరల్‌గా సీనియర్ ఐఆర్ఎస్ అధికారి అర్చనా రంజన్ నియమితులయ్యారు. 1979బ్యాచ్‌కు చెందిన ఆమె ప్రస్తుతం రాజస్థాన్ ఆదాయ పన్ను శాఖ ముఖ్యకార్యదర్శిగా పనిచేస్తున్నారు.
- దేశంలో పబ్ కల్చర్‌ను నియంత్రించాల్సిన అవసరముందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీపాద నాయక్ పేర్కొన్నారు. పర్యాటక రంగాన్ని ఇలాంటి మూలాలపై ప్రోత్సహించకూడదని ఆయన అభిప్రాయపడ్డారు.
- అత్యాచారం వంటి అత్యంత హేయమైన నేరాలలో నిందితులైన బాలలను కూడా పెద్ద వయస్సు నేరస్థులతో సమానంగా పరిగణించాలని కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ మంత్రి మేనకాగాంధీ అభిప్రాయపడ్డారు. ఈ నెల 13వ తేదీ చెన్నైలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ అత్యాచారాలు, హత్యలు వంటి నేరాలలో 16ఏళ్ళు దాటని పిల్లల ప్రమేయం ఎక్కువగా ఉంటుందన్నారు.
- విశ్వహిందూ పరిషత్ సీనియర్ నేత గిరి రాజ్‌కిషోర్(94) ఈ నెల 13న కన్నుమూసారు. ఆయన కొన్నేళ్లుగా ప్రొస్టేట్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన గిరిరాజ్ కిషోర్ రామ జన్మభూమి ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు.
- అమెరికాలోని ప్రతిష్టాత్మక 'యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా డేవిస్' ముఖ్య సమాచార కమిషనర్‌గా భారతీయ అమెరికన్, ఉస్మానియా విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిని వి.జి.మురళీ నియమితులయ్యారు. ఈ నెల 1975లో ఉస్మానియా యూనివర్శిటీకి చెందిన ఉమెన్స్ కాలేజీలో జీవశాస్త్రం, రసాయన శాస్త్రంలో డిగ్రీని, 1977లో ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీజీని, 1981లో ఇదే సబ్జెక్ట్‌లో పిహెచ్‌డిని పూర్తి చేసారు.
- దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నిర్భయ సామూహిక అత్యాచారం కేసులో వినయ్, అక్షయ్ అనే నిందితులకు విధించిన మరణశిక్షను సుప్రీంకోర్టు నిలిపివేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చేంతవరకు ఇది అమలులో ఉంటుందని సుప్రీం పేర్కొంది. ఇదే కేసులో ముఖేష్, పవన్ అనే నిందితులకు విధించిన మరణశిక్షను సుప్రీంకోర్టు ఇంతకుముందే నిలిపివేసింది.
- ప్రపంచ ఫుట్‌బాల్ ఛాంపియన్‌గా జర్మనీ అవతరించింది. ప్రపంచ కప్ ఫైనల్లో జర్మనీ 1-0 తేడాతో అర్జెంటీనాను ఓడించి కప్‌ను గెలుచుకుంది.

## వార్త - వ్యాఖ్య

వార్త :- పదేళ్ళలో దేశంలోనే ఏపి అగ్రస్థానం. - సీఎం చంద్రబాబు.
**వ్యాఖ్య :- *అప్పుల్లోనా?***

వార్త :- నిరాహారదీక్షలతో ఫలితం లేదు. - కేజ్రీవాల్.
**వ్యాఖ్య :- *కొంత బరువైతే తగ్గొచ్చుగా...!***

వార్త :- సంక్షేమ పథకాలకు 'ఆధార్'ను అనుసంధానిస్తాం. - మంత్రి యనమల.
**వ్యాఖ్య :- కోత పెట్టడానికి ఇదో వంకన్నమాట.**

వార్త :- ఆలస్యంగా వచ్చిన ఎమ్మెల్యేలకు రూ.500 జరిమానా. - రాజస్థాన్ సీఎం వసుంధర రాజే సింధియా.
**వ్యాఖ్య :- *ఒక గంట ముందుగా వస్తే ఓటీ ఇస్తారా?***

వార్త :- ప్రసాదాల విక్రయం మహాపాపం. - స్వామి పరిపూర్ణానంద.
**వ్యాఖ్య :- *స్వామిని చూడ్డానికి టిక్కెట్లు ఇంకా పాపం కదండీ!***

వార్త :- తెలంగాణలో తెదేపాను మరింత పటిష్ఠపరచాలి. - బాబు.
**వ్యాఖ్య :- *అందుకేనా ఆంధ్రాను పట్టించుకోవడం మానేస్తున్నారు.***

వార్త :- చంద్రబాబుది నియంత పాలన. - వైసిపి నేత కొణతాల.
**వ్యాఖ్య :- *అసలు పాలనంటూ ఉంటేగా...!***

వార్త :- స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాస్వామ్యం అపహాస్యం. - బొత్స.
**వ్యాఖ్య :- *దీనికి పునాది వేసింది తమ పార్టీయే!***

వార్త :- పని గంటల పెంపుతో ఫలితం ఉంటుంది. - సుప్రీం ప్రధాన న్యాయమూర్తి.
**వ్యాఖ్య :- పనిగంటలు పెంచితే కాదు, పని చేసేవాళ్ళు పనితనం పెంచితే ఫలితం ఉంటుంది.**

వార్త :- ప్రతిపక్షం గట్టిగా విమర్శించాలి... అప్పుడే ప్రభుత్వ పనితీరు మెరుగుపడుతుంది. - కేంద్రమంత్రి వెంకయ్య.
**వ్యాఖ్య :- *మీరు గట్టిగా విమర్శించకనేమో గత యూపిఏ ప్రభుత్వం మెరుగ్గా పనిచేయనిది!***

వార్త :- అనంతపురాన్ని రాజధాని చేయాలి. - మాజీమంత్రి శైలజానాథ్.
**వ్యాఖ్య :- ఈ లెక్కన జిల్లాకొక రాజధాని పెట్టాలి.**

# నగరమా?.. నరకమా?

- సమస్యల నుంచి విముక్తి ఎప్పుడు?
- ఇతర ప్రాంతాల్లో అధ్యయనం అవసరం
- అందరి సమిష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం



*నగరాలు నాగరికతకు చిహ్నాలుగా వుండాలి. నగర జీవితం యాంత్రికంగా కాక, జవసత్వాలు కలిగిన జీవనవేదికలుగా వుండాలి. పల్లెటూళ్ళలోని పచ్చదనాన్ని, మమతానురాగాల్ని పెనవేసుకుని చూడ చక్కని పూలపొదరిళ్ళులా నగరాలు కళకళలాడుతూ వుండాలి. చక్కని రోడ్లతో, క్రమబద్ధమైన వాహన రాకపోకలతో, కనువిందైన ఉద్యానవనాలతో, ఎటు చూసినా మనసులు పులకించే పల్లని ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణంతో కళకళలాడుతూ వుండాలి. అప్పుడే నగర జీవితానికి సార్ధకత.*

కానీ..ఇవన్నీ కేవలం కలలేనా?.. అనిపిస్తోంది. అందులోనూ ఎంతో చరిత్రాత్మకమైన నెల్లూరు నగర దుస్థితిని చూస్తే ఎవరికైనా సరే గుండె తరుక్కుపోతుంటుంది. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, మురుగు దిబ్బలు.. పరమ దుర్గంధ భూయిష్టంగా వుంటున్న వీధులు, కంపుకొడుతున్న మార్కెట్ల పరిసరాలు, ఎక్కడ చూసినా జివజివలాడుతూ పారుతున్న మురుగు, మరోవైపు పెరిగిపోతున్న దోమలు.. పందులు.. అంతటా కలుషితమవుతున్న వాతావరణం... ఇది నగరమా? లేక నరకమా అనిపిస్తోందని ప్రజల ఆవేదన. ఇష్టారాజ్యంగా వాహనాల రాకపోకలు, రోజురోజుకీ జటిలంగా మారిపోతున్న ట్రాఫిక్ సమస్య, ఆర్భాటంగా వేసిన సిమెంట్‌రోడ్లు చాలాచోట్ల గుంతలు పడిపోతుండడం, పవిత్రమైన పెన్నానది, ఆ పరిసరాలు కూడా దుర్గంధ పూరితంగా మారిపోతుండడం.. ఉద్యానవనాలు వెలవెలబోతుండడం.. ఇవన్నీ స్థానిక ప్రజలకు ఎంతో వేదన కలిగించే విషయాలే. ప్రభుత్వాలు మారుతున్నాయి.. పాలకులు మారుతున్నారు.. అధికారులెందరో వస్తూ పోతూనే వున్నారు. కానీ ఏళ్ళ తరబడి నెల్లూరు నగరానికి మాత్రం ఈ మురుగు నుంచి, అనేకానేక సమస్యల నుంచి విముక్తి వుండడం లేదు. చిన్న వానొచ్చినా చాలు, నెల్లూరు నగరం సోయగాలు ఇక చూడక్కర లేదు. ఏ వీధి చూసినా మురుగునీటి కాలువలై, తమ విశ్వరూపం చూపుతుంటాయి. కాలుపెడితే చాలు సర్రున మురుగులోకి జారిపోవడం తథ్యం. అది పెద్దబజారా.. చిన్న బజారా.. స్టోన్‌హౌస్‌పేటా.. మూలాపేటా.. రంగనాయకులపేటా.. ట్రంకురోడ్డా.. ఏదైతేనేం అన్నీ మురుగుకాలువల్లా మారిపోతుంటాయి. ఆ మురుగంతా రోడ్లపై చేరి, అదే ఎండకు ఎండి, ధూళిగా మారి గాలిలో కలసిపోవాల్సిందే తప్ప, ఆ మురుగు బయటకు వెళ్ళే మార్గాలే లేవు. సక్రమమైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడమే నగరానికి శాపంగా అనిపిస్తోంది.

నగరంలో నగరపాలక సంస్థ అనేది ఒకటున్నా, నగరంలో చెత్తకుప్పలను ఏ రోజుకారోజు ఒక క్రమ పద్ధతిలో ఎత్తివేసే పరిస్థితి కనిపించడం లేదు. చెత్త కుప్పలు నిర్ణీత సమయంలో, క్రమపద్ధతిలో ఎత్తివేసేందుకు గతంలోనూ ఎన్నోసార్లు ప్రయత్నాలు జరిగాయి. కానీ, ఆచరణలో కొద్ది రోజులు మాత్రమే పనిచేశాయి. మురుగునీరు వెళ్ళే దారి లేక, ఇళ్ళ ముందే మురుగునీరు మడుగులు కట్టి రోజులతరబడి కంపు కొడుతున్నా భరాయించాల్సిందే తప్ప ప్రజలకు మరో గత్యంతరం వుండడం లేదు. ఎంతకాలమీ అవస్థ?..వీటన్నిటికీ అసలు కారణం, మురుగునీటిని దూరప్రాంతాలకు తరలించేందుకు తగ్గ భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడమనే విషయం అందరికీ తెలిసిందే. కానీ, ఏళ్ళతరబడి దాని నిర్మాణం ఒక కొలిక్కి రాకపోవడం ఎంతైనా విచారకరం. ఎప్పుడో పాతకాలంలో వేసిన మురుగునీటి పైప్‌లైన్లు ఎంతోకాలంగా తుప్పుపట్టిపోయి, అక్కడక్కడా పగిలిపోయి, పక్కనే వున్న మంచినీటి పైప్‌లైన్లలోకి కూడా మురుగునీరు వచ్చి కలుషితం అవుతున్నా.. చేయగలిగిందేమీ లేదు. ఇదీ దుస్థితి. మన చెత్తనే మనం శుభ్రం చేసుకోలేమా?.. ఎంతకాలం ఈ మురుగును, ఈ దోమలను భరించాలి?.. ఇదీ ప్రజల ఆవేదన. అయితే, వాస్తవానికి మనసుపెట్టి వెదకాలేగానీ, నగరాల్లో పేరుకుపోతున్న చెత్తకుప్పలను ఎప్పటికప్పుడు ఎత్తివేసేందుకు బోలెడు పథకాలే వున్నాయి. దేశంలోని అనేక నగరాల్లో ప్రజల అవసరాలు తీర్చేందుకు బృహత్తరమైన పథకాలెన్నిటినో అమలు చేస్తున్నారు. నగరాలను పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా వుంచేందుకు, నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు.. చిత్తశుద్ధి వుండాలే కానీ, అనేకానేక పథకాలు కోకొల్లలుగానే వున్నాయి. శాస్త్ర సాంకేతిక రంగాలు శరవేగంగా అభివృద్ధి చెంది, అత్యంత అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానం అందరికీ అందుబాటులోకి వస్తున్న నేటి రోజుల్లో ఎలాంటి సమస్యలనైనా పరిష్కరించుకోవచ్చు. దేశంలో ఎన్నో నగరాలు ఇలాంటి సమస్యలను, అవస్థలన్నిటినీ అధిగమించి, అన్ని రంగాల్లోనూ ఇప్పుడు పురోగమిస్తున్నాయి. అలా.. అన్నివిధాలా అభివృద్ధి చెందిన నగరాలను ఎంపిక చేసుకుని, వాటిని మార్గదర్శకం చేసుకోవచ్చు. వాటి పనితీరును పూర్తిస్థాయిలో అధ్యయనం చేయడం ద్వారా, ఇక్కడి పరిస్థితులకు అనువైన మార్గాలను అన్వేషించవచ్చు. అందుకు ప్రతిభామూర్తులైన నిపుణుల బృందాలను నియమించుకుని, తద్వారా మంచి పథకాలను ఎంపిక చేసుకుని, ఇక్కడి ప్రజల ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా మరిన్ని పథకాలను రూపుదిద్దుకోవచ్చు. దేనికైనా అధ్యయనం ముఖ్యం. ప్రగతిని సాధించాలన్న ధ్యేయం ముఖ్యం.

మెరుగైన రోడ్లు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల నియంత్రణ, పారిశుద్ధ్య పరిరక్షణ, ఉద్యానవనాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరా వగైరాలతో పాటు, కార్యాలయాల నిర్వహణ, పన్నుల విధానం, నిధుల సమీకరణ.. వ్యయం చేసే విధానం.. తదితర అన్ని అంశాలపైనా ఆయా విభాగాలకు సంబంధించిన నిపుణులను కమిటీలుగా నియమించి, దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఆయా అంశాల్లో అమలుచేస్తున్న విధానాలను పరిశీలించి, వాటిలో మనకు మేలైనవి, మెరుగైనవనుకున్న విధానాలను ఇక్కడ అమలు చేసేందుకు పరిశీలించవచ్చు. అంతేకాక, దేశవ్యాప్తంగా ఆయా రంగాల్లో విశేష సేవలందిస్తున్న శాస్త్రవేత్తలు, నిపుణులను, ఆయా రంగాల్లోని అధికారులను సంప్రదించడం ద్వారా, వారితో సమావేశాలు ఏర్పరచి వారి అభిప్రాయాలను తెలుసుకోవడం ద్వారా మన నగరానికి సంబంధించిన అనేక సమస్యలకు పరిష్కారాలనూ కనుగొనవచ్చు. అవినీతికి, అక్రమాలకు తావు లేని పథకాలను రూపొందించేందుకు అందరూ కలసి ఆలోచించి, చిత్తశుద్ధితో నడుము బిగిస్తే, నగరాన్ని సమస్యల బారి నుంచి తప్పించి, పగతిబాట పట్టించడం పెద్ద కష్టమేమీ కాదు. ప్రత్యేకించి దేశవ్యాప్త ఖ్యాతిగన్న మంచి నేత, అభివృద్ధి ప్రదాత అయిన కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు, విద్యావేత్త అయిన మంత్రి నారాయణ తదితర నాయకులతోపాటు, ఉత్తమ సేవలందించే అధికారులు ఇక్కడెందరో వుండడం నెల్లూరుకు అదృష్టమనే చెప్పాలి. అందరి సహకారంతో, సమిష్టి కృషితో నెల్లూరు నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దుకోవచ్చు.

నగర మేయర్‌తో పాటు, కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు, మేధావులు అందరూ కలసి ఆలోచించి, ప్రజలకు మేలైన విధానాలను, మంచి పథకాలను అమలు చేసి, నగరాన్ని సమస్యలనుంచి గట్టెక్కిస్తారని, నగరాభ్యున్నతికి గట్టి కృషి చేస్తారని ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. అయినా, అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ ఎంతోమంది మంచినేతల సహకారం వుండగా... నగరాన్ని సుందరనందనంగా తీర్చిదిద్దుకునేందుకు ఇంతకంటే మహదవకాశం మరింకెప్పుడొస్తుంది?...

## మోత మోగిస్తున్న కూరగాయలు

వినియోగదారుడు కూరగాయల మార్కెట్‌కు వెళ్ళినా, మాంసం మార్కెట్‌కు వెళ్ళినా ధరలలో పెద్ద తేడా కనిపించడం లేదు. మాంసాహారులైతే కూరగాయలు కొనే బదులు ఆ డబ్బుతోనే చికెన్, చేపలు వంటివి కొని రోజూ నాన్‌వెజ్ రుచులు ఆస్వాదించవచ్చు. మార్కెట్లో కూరగాయల ధరలు అంతగా మండిపోతున్నాయి మరి. మదనపల్లె వద్ద అప్పుడప్పుడు రైతులు టమోటాలను రోడ్ల మీద గుట్టలు గుట్టలుగా పోసి పోతుంటారు. కిలోకి రెండు రూపాయలు కూడా ధర లేనప్పుడు వారిలా చేసి వెళుతుంటారు. అలాంటి టమోటా ఇప్పుడు కిలో 70రూపాయలు పలుకుతుంది. టమోటా ధర వింటేనే కొనుగోలుదారులు కళ్ళు తేలేసే పరిస్థితి. అన్ని రకాల కాయగూరలు కూడా సగటున 40రూపాయలకు తక్కువ లేకుండా వున్నాయి. గతంలో వంద రూపాయలు తీసుకుని మార్కెట్‌కు వెళితే నాలుగైదు రోజులకు సరిపడా కూరగాయలొచ్చేవి. ఇప్పుడు రెండురోజులకు కూరగాయలు కావాలన్నా 500నోటు జేబులో ఉండాల్సిందే!

## 23 నుంచి ఆంధ్ర మహాభారత ఉపన్యాసాలు

నెల్లూరులోని పద్య కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 26వ తేది వరకు టౌన్‌హాలులో 'ఆంధ్ర మహాభారత ఉపన్యాసములు' కార్యక్రమం నిర్వహిస్తామని పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ తెలియజేశారు. 23వ తేది సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో తణుకుకు చెందిన 'అవధాన రాజహంస' బిరుదాంకితులు బ్రహ్మశ్రీ కోట వేంకట లక్ష్మీనరసింహం ఉపన్యాసకులుగా పాల్గొని 'శాంతి పర్వము-తృతీయాశ్వాసము' అనే అంశంపై ప్రసంగిస్తారని, ఈ సభకు సంయుక్త కలెక్టర్ శ్రీమతి జి. రేఖారాణి విశిష్ట అతిథులుగా, ప్రముఖ పారిశ్రామికవేత్త గుర్రం బాబయ్య సభాపోషకులుగా వ్యవహరిస్తారని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, 24వ తేది సాయంత్రం జరిగే కార్యక్రమంలో బ్రహ్మశ్రీ కోట వేంకటలక్ష్మీనరసింహం పాల్గొని 'శాంతి పర్వము-చతుర్థాశ్వాసం' వివరిస్తారని, ఈ సభకు వివిఎస్‌యు వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.రాజారామిరెడ్డి విశిష్ట అతిథులుగా పాల్గొంటారని, అచ్యుత సుబ్రహ్మణ్యం కళ్యాణమండపం అధినేత అచ్యుత సుబ్రహ్మణ్యం సభాపోషకులుగా పాల్గొంటారని తెలిపారు. 25వ తేది సాయంత్రం జరిగే కార్యక్రమంలో బ్రహ్మశ్రీ కోట లక్ష్మీనరసింహం పాల్గొని శాంతిపర్వము-పంచమాశ్వాసం వివరిస్తారని, వివిఎస్‌యు రిజిస్ట్రార్ ఆచార్య కె. నాగేంద్రప్రసాద్ విశిష్ట అతిథులుగాను, శుభమస్తు అధినేత బివి రమణయ్య సభాపోషకులుగా పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. చివరిరోజైన 26వ తేది సాయంత్రం జరిగే కార్యక్రమంలో ఉపన్యాసకులు బ్రహ్మశ్రీ కోట వేంకటలక్ష్మీనరసింహం పాల్గొని శాంతి పర్వము-షష్ఠాశ్వాసంపై ప్రసంగిస్తారని, ఈ సభకు టౌన్ డిఎస్పీ పి. వెంకటనాథరెడ్డి విశిష్ట అతిథులుగా, సమాజసేవా పరాయణులు పాబోలు రామసుబ్బయ్య సభాపోషకులుగా వ్యవహరిస్తారని ఆయన వివరించారు. ప్రతిరోజూ సభా ప్రారంభానికి ముందుగా సుప్రసిద్ధ రంగస్థల కళాకారులచే పద్యపఠనం వుంటుందని, ఈ కార్యక్రమాలకు సాహిత్యాభిమానులు, కళాకారులు ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశం కొరకు

## ముస్లిం బాలికలకు ఆహ్వానం

ఆంధ్రప్రదేశ్ గురుకుల ఇంగ్లీషు మీడియం మైనారిటీ బాలికల పాఠశాలలో 5, 6, 7తరగతులలో ప్రవేశం కోసం చిత్తూరు, వైయస్సార్ కడప, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాల ముస్లిం బాలికలను దరఖాస్తుచేసుకోమని పాఠశాల ప్రిన్సిపాల్ సి.శ్యామల కోరుతున్నారు.

చిత్తూరు నుండి 5కిలోమీటర్ల దూరంలో పెనుమూరు క్రాస్ సందు ఎపిఆర్ఇఐ సొసైటీ, హైదరాబాద్ వారిచే ఏర్పాటు చేయబడిన ఈ పాఠశాలలో చేర్చేందుకు 08572-200055 ఫోను నెంబరులో సంప్రదించమని తెలిపారు.

ఈ పాఠశాలలో 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఉచిత హాస్టల్ వసతితో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయినులతో బోధన జరుగుతోందని తెలిపారు. ముస్లిం మైనారిటీ విద్యార్థినుల కొరకే ఈ ప్రభుత్వ గురుకుల పాఠశాల స్థాపించ బడిందని తెలిపారు.

## ప్రతి చినుకునూ జాగ్రత్త చేసుకోవాలి

**వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు**



వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

వర్షాధారంతో వచ్చే ప్రతి నీటి బిందువును వృధాగా పోనివ్వకుండా, నీరు-మీరు కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేసుకోవడం ద్వారా వాటిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 15న రాష్ట్రంలోని కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. భూగర్భ జలాలు, నీటిపారుదల చెరువులు, చెక్‌డ్యామ్‌ల పరిస్థితులపై దృష్టి సారించాలని, వాటికి అవసరమైన మరమ్మతులను చేసి, పూడికలు తీసి, నీటి సామర్థ్యం పెంచుకునే విధంగా రూపొందించుకోవాలని సిఎం సూచించారు. నీటి నిర్వహణ సంస్థ, నీటిపారుదలశాఖ, అటవీ శాఖ, భూగర్భజల శాఖల సమన్వయంతో అవసరమైన ప్రణాళికలు రూపొందించి నీటివనరులు పెంపుదలకు కృషి చేయాలన్నారు. ఆమేరకు సిఎం ఆదేశానుసారం జిల్లాలోని అధికారులు తగు చర్యలు తీసుకోవాలని, జిల్లాలో నీరు-మీరు కార్యక్రమం సమర్ధవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లాకలెక్టర్ శ్రీకాంత్ జిల్లా అధికారులను ఆదేశించారు.



ఈ నెల 19న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడులు కలిసి ప్రారంభించనున్న నెల్లూరులోని ప్రభుత్వ వైద్యకళాశాల పనులను ఈ నెల 16వ తేదీన పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, పక్కన జాయింట్ కలెక్టర్ రేఖారాణి

# కలను నెరవేర్చుకున్న ద్వారక



నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ కావాలనుకున్న తన కలను ముక్కాల ద్వారకానాథ్ నెరవేర్చుకున్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్గా ద్వారక సోమవారం ఉదయం కార్పొరేషన్ కార్యాలయంలోని తన ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్కుమార్యాదవ్, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్రెడ్డితో పాటు వైకాపా కార్పొరేటర్లు కూడా పాల్గొన్నారు. ద్వారక ఉదయం స్టోన్హౌస్పేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. అక్కడ నుండి వైకాపా కార్యకర్తలు, అభిమానులతో ర్యాలీగా బయలుదేరి కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకున్నారు.

## వైభవంగా శ్రీనివాస కళ్యాణం



నెల్లూరు దర్గామిట్టలోని టిటిడి కళ్యాణ మండపంలో ఈ నెల 14న శ్రీ వేంకటేశ్వర స్వామి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్రం సందర్భంగా వైభవంగా శ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహించారు. టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్, టిటిడి హిందూ ధర్మప్రచార మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కల్యాణోత్సవం జరిగింది. టిటిడి అర్చకులు వేదగిరి ఫణిశర్మ, నాగేంద్రశర్మ స్వామివారి కళ్యాణోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించి పులకించిపోయారు. హిందూ ధర్మప్రచారమండలి అధ్యక్షులు సివి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు కొండా శేఖర్రెడ్డి, కార్యదర్శి వంజివాక ధనుంజయ, సభ్యులు కె. గిరిజ, శ్రీనివాసమూర్తి, టిటిడి ధర్మప్రచార పరిషత్ కో-ఆర్డినేటర్ మల్లెల శ్రీహరి, కార్పొరేటర్ ఆనం రంగమయూర్ రెడ్డి, వాకాటి విజయకుమార్రెడ్డి, నలుబోలు బలరామయ్య నాయుడు, వీరిశెట్టి సుధాకర్, సనత్కుమార్రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కళ్యాణోత్సవం సందర్భంగా విచ్చేసిన భక్తులకు స్వామివారి చిన్న లడ్డూల ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

### అజారుద్దీన్ మృతిపట్ల

## మంత్రి సంతాపం

ఎలక్ట్రానిక్ మీడియాలో కెమెరామెన్గా గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న నెల్లూరు పట్టణానికి చెందిన షేక్.అజారుద్దీన్ (26) ఇటీవల అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందడం పట్ల రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ సంతాపం వ్యక్తంచేశారు. అతి చిన్న వయస్సులోనే మీడియా రంగంలోకి ప్రవేశించి టీవీ5 తదితర ఛానల్స్లో చురుకుగా పనిచేసి మన్ననలు పొందిన అజారుద్దీన్ మృతి ఎలక్ట్రానిక్ మీడియాకు తీరని లోటని పేర్కొన్నారు. అజారుద్దీన్ కుటుంబసభ్యులకు మంత్రి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

### మినిస్టీరియల్ స్టాఫ్

## కోశాధికారిగా రాజేంద్రప్రసాద్

ఆంధ్రప్రదేశ్ పాఠశాలల విద్యాశాఖ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారిగా జిల్లాకుచెందిన జూనియర్ అసిస్టెంట్ కె.రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు. ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్ర అసోసియేషన్ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### రిజిస్ట్రార్ల సంఘం

## అధ్యక్షురాలిగా విజయరాణి

ఆంధ్రప్రదేశ్ సబ్రిజిస్ట్రార్ల సంఘం మహిళా విభాగం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలిగా నెల్లూరు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఐ.విజయరాణి ఎన్నికయ్యారు. అలాగే గుంటూరు జోన్కు అధ్యక్షులుగా నెల్లూరు-2 జాయింట్ సబ్రిజిస్ట్రార్ వై.నందకిషోర్ ఎన్నికయ్యారు.

## రవీంద్రకు టెన్నికాయిట్ పదవి


రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా నెల్లూరులోని వీఆర్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ ఎం.రవీంద్రబాబు ఎన్నికయ్యారు. ఇటీవల హైదరాబాద్లోని ఎల్బి స్టేడియంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో ఆయనను ఈ పదవికి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## హెచ్ఎం సస్పెండ్

వెంకటాచలం మండలంలోని చెముడుగుంట స్కూల్ ప్రధానోపాధ్యాయుడు బాలేంద్రమౌళిని సస్పెండ్ చేస్తూ గుంటూరు ఆర్జెడి పార్వతి ఉత్తర్వులు జారీచేశారు. బాలేంద్రమౌళిపై పలు ఆరోపణలు రావా స్త్రీ, శిశు సంక్షేమ అధికారులు విచారణ చేపట్టారు. వారిచ్చిన నివేదిక ఆధారంగా ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు.

# నెల్లూరు కబుర్లు

## బాబు వస్తున్నాడు



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 19వ తేదీన నెల్లూరుకు వస్తున్నారు. ఆరోజు మధ్యాహ్నం 3.30గంటలకు నెల్లూరు పెద్దాసుపత్రి ప్రాంగణంలో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలను ఆయన ప్రారంభించనున్నారు. అనంతరం జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించే అవకాశముంది. అలాగే నగరంలో బహిరంగ సభ ఏర్పాటుకు కూడా సన్నాహాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి అయ్యాక చంద్రబాబు జిల్లాలో కాలు పెట్టడం రెండోసారి. గత నెల 29వ తేదీన పియస్ఎల్వి రాకెట్ ప్రయోగాన్ని తిలకించేందుకు ఆయన శ్రీహరి కోటలోని షార్ సెంటర్కు రావడం జరిగింది. అయితే ఆరోజు పర్యటన అక్కడికే పరిమితమైంది. నెల్లూరుజిల్లాలో బహిరంగ కార్యక్రమాలకు రావడం ఇదే మొదటిసారి. తెలుగుతమ్ముళ్లు చంద్రబాబు కోసం భారీఎత్తున స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు.

## వెంకయ్యకు స్వాగత సన్నాహాలు

కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా ఈ నెల 18న నెల్లూరుకు వస్తున్న యం.వెంకయ్యనాయుడుకు భారీ స్వాగత సన్నాహాలు జరుగుతున్నాయి. కేంద్రమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి దాదాపు రెండునెలలు కావస్తుంది. చాలా ఆలస్యంగా ఆయన నెల్లూరుకు వస్తున్నారు. గత ఎన్నికల ఫలితాల తర్వాత జిల్లాలో రాజకీయ శూన్యత ఏర్పడింది. ఎక్కువసీట్లు వైకాపాకు వచ్చాయి. రాష్ట్రమంత్రివర్గంలో జిల్లాకుచెందిన పి.నారాయణకు చోటు దక్కినప్పటికి ఆయనకు జిల్లా అవసరాలపై పూర్తి అవగాహన లేదు. ఈ నేపథ్యంలో జిల్లా అభివృద్ధికి వెంకయ్య నాయుడే దిక్కయ్యారు. ఆయన రాక కోసం జిల్లాలో అన్ని వర్గాల వారు ఎదురుచూస్తున్నారు.

## తిట్టుకుంటున్నారు

జిల్లా పరిషత్ ఛైర్మెన్ ఎన్నిక రెండు సార్లు వాయిదా పడడంతో అధికారులు, పోలీసులు తిట్టుకుంటున్నారు. వాళ్లకు ఇదొక తలనొప్పిగా మారింది. వీరికంటే కూడా జడ్పీ ఆఫీసు వద్ద వుండే షాపుల వాళ్లు ఎక్కువుగా తిట్టుకుంటున్నారు. ఎన్నికల రోజున పోలీసులు వీరి షాపులను మూయించేస్తున్నారు. దీంతో వారి వ్యాపారాలు దెబ్బతింటున్నాయి. ఒక్క రోజైతే ఫర్వాలేదు. ఇలా వాయిదాలు పడుతూ, ఎన్నికను నిర్వహించేటప్పుడల్లా తమ వ్యాపారాలను బంద్ చేయమంటే తమ పరిస్థితేంటని వ్యాపారులు వాపోతున్నారు.

## వ్యాధిగ్రస్థునికి సూరిశెట్టి సాయం



దీర్ఘకాల చర్మ వ్యాధితో బాధపడుతున్న చేజర్ల వాసి దానరి ప్రవీణ్ కుమార్కు ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం మాజీఛైర్మెన్ సూరిశెట్టి నరేంద్ర 5వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ఆ బాలుడికి ఐదు జతల బట్టలు కూడా అందించారు.

## చొరవ చూపిన కార్పొరేటర్

నెల్లూరు నగర పాలక సంస్థ 20వ డివిజన్ కార్పొరేటర్ దాసరి రాజేష్కుమార్ తన డివిజన్ సమస్యలపై కొంత దృష్టి పెడుతున్నారు. ఈమధ్య అరవిందనగర్, లెక్చరర్స్ కాలనీల మధ్య రైల్వేలైన్ క్రింద అధ్వాన్నంగా వున్న రోడ్డును బాగుచేయించారు. అలాగే ఈ నెల 14న ఫత్తేఖాన్పేట ప్రధాన డ్రైనేజీ కాలువలో వున్న పూడికను సొంతంగా తీయించారు.

## ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం




నెల్లూరు జిల్లా ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పడింది. ఈనెల 13న నెల్లూరు శ్రీనివాస అగ్రహారంలోని శ్రీ నేతాజీ (ఎం.ఎస్.ఆర్) పైలట్ హైస్కూలు ఆవరణలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మైథిలి స్కూల్ కరస్పాండెంట్ బి.మనోహరరెడ్డి అధ్యక్షులుగా, కార్యదర్శిగా శారదాస్కూలు కరస్పాండెంట్ శ్రీనివాసులు, ట్రెజరర్గా శిల్పా స్కూలు కరస్పాండెంట్ వై.మల్లిఖార్జునరెడ్డి, ఉపాధ్యక్షులుగా గూడూరు ప్రాస్పరోస్కూలు కరస్పాండెంట్ దశరథరామిరెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం నుంచి ఎన్.శ్రీధర్ ఇతర కార్యవర్గసభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బి.మనోహరరెడ్డి మాట్లాడుతూ 10వతరగతిలో మారిన పరీక్షా విధానంపైన సబ్జెక్టువారీగా ఒక్క రోజు ఓరియెంటేషన్ త్వరలోనే ఏర్పాటు చేయడం జరుగుతుందని, కరస్పాండెంట్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి పాఠశాలల కరస్పాండెంట్స్, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతాజీ సుబ్బారెడ్డి, సంఘమిత్ర స్కూలు కరస్పాండెంట్ కె.రవీంద్రరెడ్డి, గీతాంజలి కరస్పాండెంట్ వెంకటరామయ్య, కె.భాస్కరరెడ్డి, బి.ఆదిశేషు మొదలగువారు పాల్గొన్నారు.

## ఆర్టీసీనే ఎక్కండి...

నెల్లూరు-2 ఆర్టీసీ డిపో మేనేజర్ షమీమ్, అధికారులు సోమవారం నెల్లూరులోని విఆర్సి సెంటర్, ఆత్మకూరు బస్టాండ్ల వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణీకులను ఎక్కించుకుంటున్న ప్రైవేట్ వాహనాలను అడ్డుకున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఎక్కి సురక్షితంగా గమ్యానికి చేరుకోండని ప్రయాణీకులకు సూచించారు. ప్రయాణీకుల కోసం ఆత్మకూరు బస్టాండ్లో చెత్తకుండీలను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు మహ్మద్రఫి, రమేష్రెడ్డి, నాగరాజు, ఏఎస్ఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# వైద్యరంగంలో దూసుకెళ్తున్న నెల్లూరు

సింహపురి సమాచారం




**నెల్లూరు నగరంలో కార్పొరేట్ ఆసుపత్రులు విస్తరిస్తున్నాయి. మనల్ని చెన్నై, హైదరాబాద్ వంటి నగరాలకు పరుగెత్తే పని లేకుండా చేస్తున్నాయి. చెన్నై వంటి మహానగరాలలో ఉండే కార్పొరేట్ ఆసుపత్రులు, అత్యాధునిక వైద్యసదుపాయాలు నెల్లూరులో అందుబాటులోకి వస్తున్నాయి.**

కొన్నేళ్ల క్రితం నెల్లూరు నగరంలో పెద్దస్థాయి హాస్పిటల్స్ అంటే పెద్దాసుపత్రి, కన్యకల ఆసుపత్రి, అమెరికన్ ఆసుపత్రులే! ఈ ఆసుపత్రుల్లో మాత్రమే అన్ని విభాగాలలో వైద్యసేవలు అందేవి. కాలక్రమేణా నగరమంతా ప్రైవేట్ ఆసుపత్రులు విస్తరించాయి. ముఖ్యంగా పొగతోటంతా డాక్టర్లతో నిండిపోయింది. వివిధ విభాగాల స్పెషలిస్టులతో ఆసుపత్రులు ఏర్పడ్డాయి. క్రమక్రమంగా కొన్ని సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులు వచ్చాయి. అయినా కూడా పూర్తిస్థాయిలో నాణ్యమైన వైద్యం అందక చాలామంది రోగులు చెన్నై, హైదరాబాద్ వంటి నగరాలకు పోతుండేవాళ్ళు.

ప్రస్తుతం చూస్తే వైద్యపరంగా నెల్లూరు కొంత ముందడుగు వేసిందనే చెప్పవచ్చు. నెల్లూరులో అత్యాధునిక వైద్యసౌకర్యాలతో కార్పొరేట్ ఆసుపత్రులు వస్తున్నాయి. కొన్నేళ్ల క్రితమే నారాయణ మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రి అందుబాటులోకి రాగా ఇప్పుడు అదే ప్రాంగణంలో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి కూడా ఏర్పడింది. ఇక దర్గామిట్టలో బొల్లినేని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నెలకొల్పడం తెలిసిందే! బొల్లినేని వాళ్లే ముత్తుకూరు రోడ్డులో 4ఎకరాల సువిశాల ప్రాంగణంలో భారీస్థాయిలో 'కిమ్స్' ఆసుపత్రి నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇక జాతీయ రహదారిని ఆనుకుని చింతారెడ్డిపాలెం జంక్షన్ వద్ద 'సింహపురి హాస్పిటల్' అనే కార్పొరేట్ ఆసుపత్రి ప్రారంభం కావడం తెలిసిందే!

ఇక అంతర్జాతీయంగా వైద్యసేవలలో విశిష్టఖ్యాతి పొందిన అపోలో హాస్పిటల్స్ సారథ్యంలో ముత్తుకూరురోడ్డులో నిర్మిస్తున్న అపోలో హాస్పిటల్ కూడా త్వరలో ప్రారంభం కాబోతుంది. పెద్దాసుపత్రి ప్రాంగణంలో ప్రభుత్వ వైద్యకళాశాల, 150పడకల సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులు కూడా ప్రజలకు వైద్యసేవలందించడానికి సిద్ధమవుతున్నాయి. ఇండియన్ రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి నెల్లూరుజిల్లా ప్రజలకే కాక చిత్తూరు, ప్రకాశం, కడప వంటి జిల్లాల ప్రజలకు కూడా సేవలందిస్తుంది. ఈ ఆసుపత్రిలోనూ ఎప్పటికప్పుడు అడ్వాన్స్ టెక్నాలజీ వైద్య పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంటూ రోగులకు వైద్యసేవలను మెరుగుపరుస్తుండడం విశేషం.

బెంగుళూరు, చెన్నై నగరాలలోని కార్పొరేట్ ఆసుపత్రులలో కూడా లేని అత్యాధునిక సాంకేతిక వైద్యపరికరాలు నెల్లూరులోని కొన్ని హాస్పిటల్స్‌లో ఉన్నాయి. అయితే ఆసుపత్రులు పెరుగుతున్నాయి గాని నిపుణులైన వైద్యుల కొరత ఇంకా సమస్యగానే ఉందని చెప్పవచ్చు.

## కోతలకు కోతేసారు!

ఎట్టకేలకు కరెంట్ కష్టాలు తగ్గినట్లే కనిపిస్తుంది. ఎండలు తగ్గాయి, వాతావరణం కొంత చల్లబడింది. దీనికితోడు రాష్ట్రానికి కరెంట్ ఉత్పత్తి విషయంలో ఊరట కలిగింది. రాష్ట్రానికి ఇతర ప్రాంతాల నుండి విద్యుత్ సరఫరాకు ఎన్‌టిపిసి అంగీకరించింది. కేంద్ర రాష్ట్ర విభజన సమయంలో చేసిన విద్యుత్ కేటాయింపులను పునఃసమీక్షించడం వల్ల రాష్ట్రానికి ఇంకొంచెం విద్యుత్ కేటాయింపు పెరిగింది. కృష్ణపట్నం జెన్‌కోతో పాటు రాష్ట్రంలోని ఇంకొన్ని ప్రాజెక్ట్‌లలో విద్యుత్ ఉత్పత్తి మెరుగుపడనుంది.

ఒకేసారి కరెంట్ ఉత్పాదన అందుబాటులోకి రావడంతో కోతలకు బ్రేక్ పడ్డట్లయ్యింది. మొన్నటివరకు నెల్లూరులో ఐదున్నర గంటలు, మున్సిపాల్టీల్లో ఆరు గంటలు, గ్రామాల్లో 12గంటలు కరెంట్ కోతలుండేవి. ఈ కోతలతో ప్రజలు, రైతులు అల్లాడిపోయారు. ఇప్పుడు ఆ కష్టాల నుండి ఉపశమనం కలిగింది. రోజుకు 24గంటలు విద్యుత్ వుండే రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్‌ను కేంద్రం పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసింది. ఇది ఆచరణ రూపం దాలిస్తే ఇక మనం కోతల్ని చూడకపోవచ్చు.

## ఎన్నాళ్ళకెన్నాళ్ళకు!

సుదీర్ఘకాలంగా పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్న పలువురు సిఐలకల నెరవేరింది. రాష్ట్ర వ్యాప్తంగా 55మంది సిఐలకు డిఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. డిఎస్పీలుగా పదోన్నతి పొందిన వారిలో ఈ జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు సిఐలతో పాటు గతంలో ఇక్కడ పనిచేసిన ఇంకొందరు సిఐలు కూడా వున్నారు. జిల్లాలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న వై.జయరామసుబ్బారెడ్డి, డిటిసి సిఐగా పనిచేస్తున్న ఏ.వి.చంద్రశేఖర్, సిఐడి సిఐ ఎం.వెంకటేశ్వర రావు డిఎస్పీలుగా పదోన్నతి పొందారు. అలాగే గతంలో ఈ జిల్లాలో పనిచేసి ప్రస్తుతం వివిధ ప్రాంతాలలో సిఐలుగా వున్న పి.వీరాంజనేయరెడ్డి, టి.వి.కొండారెడ్డి, వి.పోతురాజు, వై.శ్రీనివాసులురెడ్డి, కె.ప్రకాశ్‌రావు, పి.మురళీకృష్ణ, ఎన్.కోటారెడ్డిలు కూడా డిఎస్పీలుగా పదోన్నతి పొందారు.

## వెంకయ్యకు 19న పౌరసన్మానం


విలేకరులతో మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడుకు ఈ నెల19న నెల్లూరులోని విపిఆర్ కళ్యాణ మండపంలో ఘనంగా పౌరసన్మానం నిర్వహించనున్నట్లు మాజీమంత్రి ఆదాల ప్రభాకరరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర విలేకరులకు తెలియజేశారు. జాతీయస్థాయిలో మంచి గుర్తింపు పొందిన వెంకయ్యనాయుడు కేంద్ర మంత్రి కావడం జిల్లా ప్రజల అదృష్టమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా, రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు, అన్ని వర్గాల వారి సహకారంతో మన జిల్లా సమగ్రాభివృద్ధిని కాంక్షిస్తూ, వెంకయ్యనాయుడుకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. 19వతేదీ సాయంత్రం 7 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు డాక్టర్ పి.నారాయణ, కామినేని శ్రీనివాస్‌లతో పాటు, జిల్లా ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాజీ శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నెల్లూరు డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్లు ఆధార్‌కార్డులు అందించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన అన్ని రకముల సామాజిక భద్రతా పెన్షనుదారుల వివరాలను ఆధార్ డేటాతో అనుసంధానం చేయాలని ఆదేశాలు అందాయని నెల్లూరుజిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ తెలిపారు. జిల్లాలోని అందరు పెన్షనర్ల (వృద్ధాప్య, వైధవ్య, వికలాంగ, చేనేత తదితర పెన్షనుదారులు) ఆధార్ వివరాలు సేకరించేందుకు జిల్లాలోని అందరు మండల అభివృద్ధి అధికారులు మునిసిపల్ కమీషనరు ఈనెల 16 నుండి తమ సిబ్బందిని గ్రామాలకు, వార్డులకు పంపుతారని తెలిపారు. పెన్షనుదారులందరూ జూలై నెల పెన్షను తీసుకొనే సమయంలో తమ ఆధార్ కార్డు ఫోటోస్టాట్ కాపీని సంబంధిత పెన్షను పంపిణీ చేయు ఏజన్సీలకు, గ్రామ పంచాయితీ కార్యదర్శులకు, మునిసిపల్ సిబ్బందికి అందజేయాలని కోరారు. అదే విధంగా ఇంకా ఆధార్ క్రింద నమోదు చేయించుకోని పెన్షనుదారులు ఈనెల 26లోపు సంబంధిత తహశీల్దారు కార్యాలయములో సంప్రదించి ఆధార్ క్రింద నమోదు చేయించుకోవలెనని సూచించారు.

## పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

**- నగర శాసనసభ్యులు డా॥ పి.అనిల్**



నెల్లూరు నగర శాసన సభ్యులు డా॥ పి.అనిల్ కుమార్‌యాదవ్ ఈ నెల 15వ తేదీ 43వ డివిజన్ లోని జెండావీధి, బొందుల వీధి, పెద్దబజారు, చేపల మార్కెట్టు, షాదీమంజిల్ రోడ్డు, హల్దానీ స్ట్రీట్, పి.యన్.యం.స్కూలు రోడ్డు ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా వంటి సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకునేందుకు పర్యటించారు.

ఈ సందర్భంగా డా॥ పి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఎంతో నిష్ఠగా ఉంటారు కాబట్టి వారు నివసించే మరియు మసీదుల ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా ఎలా ఉందో తెలుసుకునేందుకు ఈ ప్రాంతంలో పర్యటించడం జరిగిందన్నారు. మసీదు ప్రాంతాల్లో చాలావరకు పారిశుద్ధ్యం బాగా ఉందని, అక్కడక్కడా కొన్ని వీధుల్లో మాత్రం పారిశుద్ధ్యం లోపించిందని, ఆ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని కమీషనర్ మరియు తత్సంబంధిత అధికారులకు చెప్పడం జరిగిందన్నారు. అలాగే ఈ ప్రాంతంలో వున్న పి.యన్.యం.స్కూల్‌లో సిబ్బంది కొరత వుందని ప్రధానోపాధ్యాయులు చెప్పారని, ఆ సమస్యను కూడా పరిష్కరించేందుకు తగుచర్య తీసుకొంటామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు యం.డి.ఖలీల్‌అహ్మద్, గోగుల నాగరాజు మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మీరా మొహిద్దీన్, ఫజల్, అతహర్, సమీవుల్లా, రియాజ్, ఆసిఫ్, సీకు, అహ్మద్, ఉమేజ్, మైనుద్దీన్, నాసర్, యం.మురళీకృష్ణ, గంధం సుధీర్‌బాబు మరియు కమీషనర్ జాన్సన్, హెల్త్ ఆఫీసరు వెంకటరమణ, యం.ఇ సంపత్ కుమార్, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.







# దేశం కోసమే రాహుల్ యోగనిద్ర

శ్రీను గల్పిక

అది దేశ రాజధాని ఢిల్లీలోని పార్లమెంటు హాల్. బడ్జెట్ సమావేశాలు వాడివేడిగా జరుగుతున్నాయి. నిత్యావసరవస్తువుల ధరలపై చర్చ రసవత్తరంగా ఉంది. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ లేచి... అధ్యక్షా... ధరలు చుక్కలనంటుతున్నాయి. ఈ ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు? దేశంలో ఇంకా 80శాతం మంది పేదరికంలోనే మగ్గుతున్నారు. పేదరికాన్ని తగ్గించడానికి ఈ ప్రభుత్వం ఏం చర్య తీసుకున్నట్లు? అని ప్రశ్నించింది! వెంటనే అద్వానీ లేచి.. అధ్యక్షా... ధరలు పెరిగింది గత ప్రభుత్వ నిర్వాకం వల్లనే. ఈ దేశంలో 80శాతం పేదరికాన్ని 60ఏళ్ల దేశాన్ని పాలించిన కాంగ్రెస్‌పార్టీ నిర్మూలించలేకపోయింది. పగ్గాలు చేపట్టి 60రోజులు కూడా కాని మాపై నిందలేస్తుందని తిప్పికొట్టాడు. కాంగ్రెస్ సభాపక్షనేత మల్లిఖార్జున ఖర్గే లేచి... అధ్యక్షా... ఈ దేశంలో ఉప్పు, పప్పు, చింతపండు, నిమ్మపండు, మిరపకాయ, సొరకాయ, జీలకర్ర, విసనకర్ర, అల్లం, బెల్లం... ఇలా అన్నింటి ధరలు పెరిగిపోతున్నాయి. సామాన్యులకు అందుబాటులో లేకుండా ఇలా ధరలు పెరిగిపోతుంటే వాటిని నియంత్రించాల్సిన ప్రభుత్వం నిద్రపోతుందా? అని ఆవేశంగా ప్రశ్నించాడు. అప్పుడే సభలో వెనుక నుండి 'గుర్ ర్ గుర్ ర్ర్...' అంటూ శబ్దం రాసాగింది. జూ నుండి సింహమేదన్నా తప్పించుకుని పార్లమెంటు హాల్‌లోకి ఏమన్నా జొరపడిందేమోనని కొందరు సభ్యులు ఆందోళన చెందారు. అందరూ ఆ శబ్దం వస్తున్న వైపు చూసారు. అంతే ఆశ్చర్యం... అక్కడ కాంగ్రెస్ యువరాజు రాహుల్ గాంధీ బెంచీ మీద పడుకుని నిద్రపోతున్నాడు. సోనియా ఒక్క ఉదుటున అక్కడకు పరుగెత్తింది... రాహుల్‌కు చెమటపట్టి ఉండడంతో కొన్ని పేపర్లను చేతిలోకి తీసుకుని అతనికి గాలి వచ్చేలా విసరసాగింది. కాంగ్రెస్ ఎంపీలంతా రాహుల్ వద్ద మూగిపోయారు. అప్పుడు వెంకయ్యనాయుడు లేచి... చూసారా అధ్యక్షా... వాళ్లేమో ప్రభుత్వం నిద్రపోతుందని విమర్శిస్తున్నారు, కాని ఇప్పుడు ఎవరు నిద్రపోతున్నారో చూసారా... ఇలా నిండు సభలో నిద్రపోయే వాళ్ళు ప్రధాని అయితే దేశమే నిద్రపోదా అధ్యక్షా! అని అడిగాడు. అప్పుడు బీజేపీ సభ్యులంతా కూడా బల్లలు చరుస్తూ... 'రాహుల్, మేలుకోవాలి... రాహుల్ మేలుకోవాలి' అని నినాదాలు చేయసాగారు. అక్కడ వి. హెచ్.హనుమంతురావు రియాక్టయ్యాడు. మీరు మనుషులా... ఇంకేమన్నానా? మీలో మానవత్వం లేదా? జాలి, కరుణ, దయా లేవా? అవతల పసిపిల్లోడు నిద్రపోతుంటే, గలభా చేస్తారా? మీరు నిద్రపోయేటప్పుడు ఎవరన్నా వచ్చి డిస్టర్బ్ చేస్తే మీకెలా ఉంటుంది? ఆకలయితే ఒక పూట ఏమీ తినకుండా ఉండొచ్చేమోగాని, నిద్ర వస్తే ఎవరన్నా ఆపుకోగలరా? అని ఆవేశంగా అడిగాడు. తన బిడ్డ నిద్రపై బీజేపీ సభ్యులు రాద్ధాంతం చేస్తుండడంపై సోనియాకు ఆవేదన కలిగింది. అదే యూపిఏ అధికారంలో వుండి... రాహుల్ నిద్రపోయివుంటే పరిస్థితి ఎలా వుండేదనే దానిపై ఊహాలోకంలోకి వెళ్లిపోయింది.

★★★★★

పార్లమెంటు హాలులో ఏ.పి. విభజన బిల్లుపై చర్చ జరుగుతుంది. కొందరు సభ్యులు విభజనను వ్యతిరేకిస్తుండగా, ఇంకొందరు సభ్యులు విభజనకు అనుకూలంగా మాట్లాడుతున్నారు. ప్రధాని మన్మోహన్‌సింగ్ మైనపుబొమ్మలా తన సీట్లో కూర్చుని అన్నీ వింటున్నారు. విపక్ష నేత సుష్మాస్వరాజ్ లేచి... ఈ వాదనలన్నీ దండగ... మీరు బిల్లు పెట్టండి... లైట్లు ఆఫ్ చేయండి... లోక్‌సభ టీవీని ఆఫ్ చేయండి... బిల్లును వ్యతిరేకించే వాళ్లను బయటకు పంపించేయండి... సైలెంట్‌గా విభజన బిల్లును ఆమోదించేసుకుందాం అని మాట్లాడింది. సోనియా(పెద్దమ్మ), సుష్మాస్వరాజ్(చిన్నమ్మ) విభజన బిల్లుపై డీల్ మాట్లాడుకుంటున్న తరుణంలో వెనుక బెంచీలో నుండి 'గుర్ ర్ ర్ గుర్ ర్ ర్' అంటూ సౌండ్ వచ్చింది. సభ్యులంతా వెనక్కి తిరిగి చూసారు. రాహుల్ తన బెంచీపై తల వాల్చి కనులు మూసుకుని ఉన్నాడు. బాగా నిద్రలోకి పోవడంతో గురకపెడుతున్నాడు. అది చూసి అద్వానీ... అధ్యక్షా... బాధ్యతగల సభ్యుడు నిండు సభలో నిద్రపోతున్నాడు, అది కూడా ఒక రాష్ట్ర భవిష్యత్ గురించి చర్చ జరిగేటప్పుడు... అంతగా నిద్ర వస్తుంటే ఇంట్లోనే పడుకుని రావచ్చుగా... ఇక్కడికి రావడమెందుకు..? ఈరోజు రాహుల్ నిద్రపోయాడు... ఈయనను ఆదర్శంగా తీసుకుంటే రేపు సభకు వచ్చిన సభ్యులందరూ నిద్రపోతారు. ఇప్పటికే ప్రభుత్వోద్యోగులు ఇళ్లల్లో కాకుండా ఆఫీసుల్లోకి వచ్చి నిద్రపోతారనే పేరుంది. రేపు పార్లమెంటు సభ్యులకు కూడా అదే పేరొస్తే... అని మాట్లాడుతుండగా... మన్మోహన్ సింగ్ తోక తొక్కిన తాచుపాములా లేచాడు... వాట్ ఆర్ యు టాకింగ్... రాహుల్ నిద్రపోతున్నాడని అంటారా? అది నోరా... మున్సిపల్ డ్రైనేజా... ఆయన ఈ దేశం కోసం కలలు కంటున్నాడు. ఈ దేశంలో పేదరికాన్ని ఎలా నిర్మూలించాలనే అంశం మీద డీప్‌గా ఆలోచిస్తున్నాడు. కళారాణి వంటి మహిళల బ్రతుకులను ఎలా మార్చాలనే దానిపై ధ్యానంలోకి పోయి ఆలోచిస్తున్నాడు. ఆయన అలా బెంచి మీద తల వాల్చి ధ్యానం చేస్తున్నాడంటే దేశానికి మంచి రోజులు రాబోతున్నాయని అర్థం అని చెప్పాడు. వెంటనే సుశీల్‌కుమార్ షిండే లేచి... రాహుల్‌ను నిద్రపోతున్నాడన్న అద్వానీపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి, అద్వానీని సభ నుండి బహిష్కరించాలి, రాహుల్‌గాంధీకి అద్వానీ క్షమాపణలు చెప్పాలి అని డిమాండ్ చేసారు. మిగతా కాంగ్రెస్ సభ్యులు కూడా అదే నినాదాలతో అరవసాగారు. అప్పుడు వెంకయ్య నాయుడు లేచి... రాహుల్‌గాంధీ అంత బాగా నిద్రపోతుంటే మీరు ధ్యానం చేస్తున్నారంటారేంటి? ఆయన నిద్రపోవడమంటే దేశం గురించి ఆలోచిస్తున్నట్లా? అలాగైతే మాజీప్రధాని దేవేగౌడ ప్రధాని పదవిలో ఉన్నప్పుడు పగలు, రాత్రి తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ నిద్రపోయే వాళ్లు, ఆ లెక్కన చూస్తే మన దేశం అభివృద్ధిలో అమెరికాను మించిపోయి ఉండాలి. కాని అలా లేదే అని అన్నాడు. అప్పుడు దాసరి జైరాంరమేష్ లేచి... దేవేగౌడకు మా రాహుల్‌కు పోలిక పెడతారా? ఆయనకు సంగతి తిని నిద్రొచ్చేది, కాని మా రాహుల్ దేశం గురించి ఆలోచన వచ్చినప్పుడు అలా బెంచీమీద తలవాల్చి కళ్లు మూసుకుని తపోదీక్షలోకి వెళ్ళిపోతారు. ఆయనకు సభలోకి వచ్చి నిద్రపోవాల్సిన అవసరమేముంది. పెళ్లి కూడా కాకపోయే... రాత్రిళ్లు కావాల్సినంత నిద్రపోతాడు, ఆయన ఖచ్చితంగా దేశం కోసమే అలా పడుకుని కలలు కంటుంటారు. మీరు అనవసరంగా గలభా సృష్టించి ఆయన ఏకాగ్రతకు భంగం కలిగించవద్దు.... అని అధ్యక్షా, ఈ సభలో చర్చ ఇలాగే కొనసాగితే మన రాహుల్‌బాబు ఏకాగ్రత చెదిరిపోతుంది. ఆయన దేశం కోసం చేస్తున్న ఆలోచనలన్నీ చెల్లాచెదురవుతాయి... కాబట్టి ఈ సభను నిరవధికంగా వాయిదా వేయండి.. ఎవరిళ్లకు వాళ్లు పోతారు. రాహుల్‌బాబు తపోదీక్ష నుండి బయటకొచ్చాక (నిద్ర లేచాక) ఆయనే ఇంటికి వెళతారు. పనిలో పనిగా రాహుల్ గారికి కొంచెం సౌకర్యంగా ఉండేలా ఆయన బెంచీ పక్కనే దిండు, పరుపు ఏర్పాటు చేయించండి అని కోరాడు. ఆయన ప్రతిపాదనకు కాంగ్రెస్ సభ్యులంతా చిటికెలు వేసి హర్షం వ్యక్తం చేసారు. చప్పట్లు కొడితే ఆ సౌండ్‌కు రాహుల్ లేస్తాడని. వారి కోరికను మన్నించి స్పీకర్ మీరా కుమార్ సభను వాయిదా వేసారు.

★★★★★

మేడమ్... అన్న పిలుపుతో సోనియా ఊహాలోకం నుండి బయటకొచ్చింది. అక్కడ మల్లిఖార్జున ఖర్గే ఉన్నాడు. మేడమ్, సభను వాయిదా వేసారు. పోదాం పదండి అని చెప్పాడు. బాబు... బాబు... అంటూ సోనియా రాహుల్‌ను లేపింది. రాహుల్ మత్తుగా... ఇంకొంచెం సేపు పడుకుంటాను మమ్మీ... ఈరోజు జాగింగ్‌కు వెళ్లాలనిపించడం లేదు అని గోముగా అన్నాడు. ఆ మాటకు సోనియాగాంధీ తల పట్టుకుంది.

## కదంబం

### అన్నిటికీ మూలం ఇదే....

- ద్వా.నా. శాస్త్రి,
హైదరాబాద్. 98492 93376.

మెదడుకి మేతనందించేది
శరీరాన్ని రీచార్జ్ చేసేది
అంతరంగ రహస్యాల్ని, అనుభవాల్ని
ఆవిష్కరించేది ప్రశ్న మాత్రమే!
ప్రశ్నించటం వల్లనే
తర్క,మీమాంస వ్యాకరణ శాస్త్రాలు
గణిత, భౌతిక, రసాయనక,
మనస్తత్వశాస్త్రాలు
'ఇంతింతై' అన్నట్టు
విశ్వవ్యాపితమయ్యాయి
ప్రశ్న వేసుకోవడం
ఆత్మ ప్రక్షాళనం చేసుకోవడమే
ఇతరులు ప్రశ్నించకుండా
మనకి మనమే ప్రశ్నించుకోవడం
సంస్కారహేతువు
జీవిత ప్రశ్నలన్నిటికి సమాధానాలు
ఉండాలనుకోవటం అత్యాశే
అవుతుంది
ప్రశ్నకి ప్రశ్నే సమాధానమయ్యే
సందర్భాలూ ఉంటాయి
ఇతరులూ మనల్ని ప్రశ్నిస్తారన్న
జాగరూకత అవసరం
నీ వేలెట్టి చూపడం అంటే నిలదీసి
ప్రశ్నించడమే
జీవిత పరీక్షలో నూటికినూరు
మార్కులు రావడం కష్టసాధ్యం
'పాస్' మార్కులకి సమాధానాలు రాసినా
చాలు
నువ్వు నిన్ను ప్రశ్నించుకోవడం
స్వస్వరూప జ్ఞానానికి చిహ్నం!!

## విజయవంతంగా సాగిన సాధనా పదయాత్ర

***ప్రతి ఒక్కరూ అందరి కోసం, అందరూ ప్రతి ఒక్కరి కోసం***

ఆరోగ్యకరమైన ఆనంద జీవనం కోసం, ఆధ్యాత్మిక సాధనంగా శ్రీ సాయిసదన్ మందిర భక్తులు, శ్రీ వెంకయ్యస్వామి సన్నిధి కుటుంబం పరిశోధనా సంస్థలు సంయుక్త నిర్వహణలో ఈనెల 13న "సాధనా పదయాత్ర" విజయవంతంగా సాగింది. నెల్లూరు చిల్డ్రన్స్‌పార్క్ దగ్గర గల శ్రీ షిర్డీ సాయిసదన్ మందిరం నుండి ముత్తుకూరుగేటు, మినీబైపాస్‌లో బెజవాడ గోపాలరెడ్డి కూడలి, అన్నమయ్య విగ్రహం, ఇస్కాన్ మందిరం మీదుగా గొలగమూడి రోడ్డులో వృద్ధులు, మహిళలు, అంధులు, వెటరన్ క్రీడాకారులు, యువత, ఉద్యోగులు, వ్యాపారులు ఉత్సాహంగా, ఉత్తేజంగా నడుస్తూ గొలగమూడిలోని అవధూత వెంకయ్యస్వామి ఆలయం వరకూ పాదయాత్ర చేసారు. ఈ సందర్భంగా సాధనా పదయాత్ర నిర్వాహకులు అల్లు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఇది "లోకాసమస్తా సుఖినోభవంతు" అన్న సంకల్పంతో సాగే నడకయాత్ర అని, ఈ యుగావతరం శిరిడీసాయినాథుడు, మానవశ్రేయస్సుకై వెలసిన సత్పురుషుడు గొలగమూడి వెంకయ్యస్వామి ఆలయాలకు అనుసంధానంగా సాగే ఆధ్యాత్మిక పదయాత్రని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మోహన్‌రాజు, కె.శ్రీనివాసులురెడ్డి, పెరుగు రామకృష్ణ, ఎక్సైజ్ సిఐ వెంకటేశ్వర్లు, పరమేశ్వరాచారి, అథ్లెట్ జి.వసుంధర, యువకులు పాల్గొన్నారు.

## వీనుల విందు చేసిన సంగీత కళాకారులు

స్థానిక కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరు టివిఎస్ కళ్యాణ్ సదన్‌లో జరిగిన కార్యక్రమంలో చిన్నారులైన సంగీత కళాకారులు వీనుల విందుగా గానంచేసి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ నెల 20వ తేదీన కళాంజలి ఆధ్వర్యంలో టౌన్‌హాలులో నిర్వహించనున్న సినీ సంగీత విభావరిలో పాటలు పాడే బాల కళాకారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ సంగీతవేత్త జివి శర్మ ఆధ్వర్యంలో బాలలకు సంగీతంలో మెళకువలు బోధించి, శిక్షణ ఇచ్చారు. కళాంజలి అధినేత అనంత్‌తో పాటు, దువ్వూరు బెనర్జీ, టివిఎస్ కళ్యాణ్ సదన్ వ్యవస్థాపక ధర్మకర్త ఎస్.అజయ్‌కుమార్, శాస్త్రీయ సంగీత అధ్యాపకులు ఎ.లక్ష్మీప్రసన్న, రమాదేవి, రాళ్ళపల్లి సుబ్బలక్ష్మి, విశ్వనాథ్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొని చిన్నారులైన సంగీత కళాకారులందరినీ అభినందించారు.



వీనుల విందుగా గానం చేస్తున్న చిన్నారులు

## 30 నుంచి జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శనలు

ఈనెల 30, 31, ఆగస్టు 1వ తేదీల్లో నెల్లూరు నగరంలో జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు డిఇఒ ఎన్.ఉష పేర్కొన్నారు. ఆ మేరకు ఈనెల15న వైజ్ఞానిక ప్రదర్శనకు చెందిన బ్రోచర్‌ను విడుదల చేశారు. 2014-15 సంవత్సరానికి సంబంధించి తమ పేర్లను నమోదు చేసుకునేందుకు నెల్లూరు డివిజన్‌వారు జులై 21న, గూడూరు డివిజన్‌వారు 22న, కావలి డివిజన్‌వారు 23న ఆయా తేదీల్లో తమ పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు.

## ఆగస్టు 2న సామూహిక సప్తగిరి సంకీర్తనలు

సుప్రసిద్ధ వాగ్గేయకారుడు అన్నమయ్య జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని, నెల్లూరులో ఆగస్టు 2 వ తేదీన సామూహిక సప్తగిరి సంకీర్తనల కార్యక్రమం నిర్వహిస్తామని హిందూ ధర్మప్రచార మండలి సభ్యులు, మాదరన్ స్కూల్ అధినేత వాకాటి విజయ కుమార్‌రెడ్డి తెలిపారు. మినీబైపాస్‌రోడ్డులోని అన్నమయ్య సర్కిల్ వద్ద ఆ రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా, ఆగస్టు 10వ తేదీన శ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. భక్తులం దరూ ఈ కార్యక్రమాలకు విచ్చేసి స్వామివారి కృపను పొందాలని ఆయన కోరారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి. ప్రముఖులతో పరిచయాలు వ్యాపకాలు పెరుగుతాయి. శుభకార్యాలలో పాల్గొంటారు. పనులు సవ్యంగా జరుగుతున్నా టెన్షన్ పడుతుంటారు. అధికారులతోను పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. ఆర్థిక సమస్యలు పరిష్కారానికి రాగలవు. కుటుంబ ఆర్థిక వ్యవహారాలలో సముచిత నిర్ణయాలు తీసుకొంటారు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

నిర్మాణాలు, రిపేర్ల పనులు జరుగుతాయి. అవసరాలకు విలాసాలకు ఖర్చులెక్కువగా ఉంటాయి. శుభకార్యాల్లో పాల్గొంటారు. శుభవార్త వింటారు. వ్యాపార వర్గాలకు ఆదాయం బాగానే ఉంటుంది. ఆర్థిక ఒప్పందాలలో జాగ్రత్త అవసరం. తొందరపాటు ప్రవర్తన నిర్ణయాలు పనికిరావు. పనులందు టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. స్థిరాస్తులు, షేర్లు పెట్టుబడులపై ఆదాయం లభిస్తుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కోర్టు వ్యవహారములు కొంత ఆందోళన కలిగిస్తాయి. బంధుముఖ్యులొకరి అనారోగ్య బాధల సంగతులు వింటారు. అనుకున్న పనులు సరిగా జరుగక, వత్తిడుల వలన ఆందోళన ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు తగ్గి ఆర్థిక ఇబ్బందులెదుర్కొనవలసి వస్తుంది. ఆర్థిక వ్యవహారాలను జాగ్రత్తగా నడపవలసి వస్తుంది. కొత్త పెట్టుబడులకు అనుకూల సమయం కాదు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

బిడ్డల ఉద్యోగ వివాహ విషయంలో శుభపరిణామాలు జరుగగలవు. ఉద్యోగులకు అధికారులకు స్థానమార్పులు అదనపు బాధ్యతలుంటాయి. ప్రభుత్వ ఆఫీసులో పనులు, ప్రభుత్వ అనుమతులందు కాలయాపన జరుగుతుంది. వృత్తిపరంగా వ్యాపకం, ఆదాయం సంతృప్తికరం. వ్యాపార వర్గాలకు ఆర్థికవృద్ధి. రాబడి పెరుగుతుంది. కొత్త పెట్టుబడులకు అవకాశాలు దొరకగలవు.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 18.07.2014 నుండి
తేది. 24.07.2014 వరకు

ఈ వారము మీనంలో కేతువు, మిథునంలో బుధశుక్రులు, కర్కాటకంలో రవిగురువులు, కన్యలో రాహువు, తులలో శనికుజులు, మీనమేషవృషభమిథున రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

ముహూర్తములు లేవు.

గురు మౌఢ్యమి జరుగుచున్నది.

**ఆషాడమాసకృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 18 | శుక్ర | సప్తమి | రా॥గం.10.35వ॥ |
| తేది. 19 | శని | అష్టమి | రా॥గం.12.04వ॥ |
| తేది. 20 | ఆది | నవమి | రా॥గం.11.04వ॥ |
| తేది. 21 | సోమ | దశమి | రా॥గం.10.26వ॥ |
| తేది. 22 | మంగళ | ఏకాదశి | రా॥గం.10.25వ॥ |
| తేది. 23 | బుధ | ద్వాదశి | రా॥గం.10.45వ॥ |
| తేది. 24 | గురు | త్రయోదశి | రా॥గం.11.43వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

బాకీలు చెల్లించడం, రావలసిన బాకీలలో కొంత రాబట్టడం జరుగుతుంది. బంధుమిత్రులతో సంబంధాలు బలపడి సన్నిహితంగా మెలుగుతారు. గృహ వ్యాపారాల స్థానములు మారడం, వస్తు వాహన గృహ రిపేర్ల ఖర్చులు ఉంటాయి. ఆర్థికస్థితి బాగానే ఉంటుంది. వృత్తి జీవనం వారికి అంత మేలుగా ఉండదు. వ్యాపార వర్గాలకు ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

అనుకున్న పనులు నిదానంగా జరుగుతుంటాయి. గృహ మార్పులుంటాయి. వస్తు, ఇంటి, వాహన రిపేర్లకు ఖర్చు కాగలదు. ఆర్థిక ఇబ్బందులను వృత్తి వ్యాపారాలను అధిగమిస్తారు. రాబడిలో స్వల్ప పెరుగుదల ఉంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు జరుగుతాయి. కుటుంబ ఖర్చులు వైద్య ఖర్చులు పెరుగుతాయి. మీ సామర్థ్యంతో ఇతరులను ప్రభావితం చేస్తారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వ్యాపార భాగస్వామ్యం లభించడం, పెట్టుబడులపై లాభాలుంటాయి. ఉద్యోగులకు పనిభారం స్థానచలనం ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో ఆశించిన ప్రగతి ఉండదు. ఆదాయం తగ్గుతుంది. స్థిరాస్తుల లావాదేవీలందు అవకాశాలు లభించగలవు. అనుకున్న పనులకు ఆటంకములుండినా సమర్థవంతంగా జరుపుతారు. ఆలోచనలు పథకాలు కార్యరూపానికి తెచ్చే ప్రయత్నం చేస్తారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం, ప్రభుత్వ అనుమతులందు ఆలస్యముంటుంది. బంధువు యొక్క అనారోగ్యవార్త వింటారు. వ్యాపారాల నిర్వహణలో ఇబ్బందులుండినా అధిగమిస్తారు. అనుకున్న పనులను పట్టుదలతో శ్రమపడి సాధించుకొంటారు. నూతన పెట్టుబడులు, వ్యాపారభాగస్వామ్యాలకు అనుకూల సమయము ఉత్సాహంతో క్రొత్త ఆర్థిక ప్రయత్నాలు జరుగుతాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

అనుకోని అదనపు ఖర్చులు పైనబడతాయి. వాహనాలు నడిపేవారు, కరెంటు, యంత్రాల పనులు చేసేవారు జాగ్రత్తగా ఉండండి. ప్రభుత్వ అనుమతులు మంజూరాకాగలవు. మంచి పలుకుబడి కీర్తి ప్రతిష్టలుంటాయి. ప్రముఖులతో పరిచయాలు కలుగుతాయి. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. అధికారులు వత్తిళ్ళకు ప్రలోభాలకు దూరంగా ఉండాలి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అగ్రిమెంట్ల విషయంలో జాగ్రత్తపడండి. వ్యవసాయ రంగాల వారికి, మార్కెట్ రంగాల వారికి ఆదాయం సంతృప్తికరము. పనులు ఆలస్యమైనా అనుకొన్న రీతిలో నెరవేర్చుకొంటారు. వృత్తి వ్యాపార రంగాలలో అభివృద్ధితో పాటు ఆదాయం బాగుంటుంది. పిల్లల వల్ల చిన్న చిన్న సమస్యలు ఏర్పడవచ్చును. పెట్టుబడుల మీద ఆదాయం లభించగలదు. ప్రశాంతంగా ప్రయాణాలు జరుగుతాయి.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కుటుంబసభ్యుల అనుకూలత తక్కువగా ఉంటుంది. ఉద్యోగులకు పనిభారం స్థానచలనం ఉంటుంది. ఆర్థిక లావాదేవీలు, కొత్త ఆర్థికావకాశాలు నిరుత్సాహ పరుస్తాయి. ముఖ్యపనులను ఎలా నిర్వహించాలో అర్థంకాక టెన్షన్‌పడుతుంటారు. ఇంట, బయట ఖర్చులు అదనంగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో స్థబ్దత చోటు చేసుకొని ఆదాయం తగ్గుతుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అనుకోకుండా ప్రయాణాలుంటాయి. భాగస్వామ్యాలు కొత్త పెట్టుబడులు అనుకూలిస్తాయి. ఆరోగ్యం బాగుంటుంది. ఆర్థికపరమైన ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చగలవు. వృత్తి వ్యాపారములందు అభివృద్ధి ఉండి ఆదాయము పెరుగుతుంది. ఉద్యోగులు విధి నిర్వహణ సమర్థవంతంగా నిర్వహిస్తారు. ఉపాధి పథకాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి.

# మాదాల చారిటబుల్ ట్రస్టు వైద్య శిబిరం




నెల్లూరు రంగనాయకులపేటలోని నెల్లూరు నగర పాలక ప్రాథమిక పాఠశాలలో ఈనెల 11న ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడినది. ఉచిత వైద్య శిబిరాన్ని ప్రముఖ వైద్యులు డా॥మాదాల వెంకటేశ్వరరావు ప్రారంభిస్తూ విద్యార్థినీ, విద్యార్థులకు తగిన సూచనలు, వారి తల్లిదండ్రులకు వ్యాధులపై అవగాహన కలిగించారు. అనంతరం ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డా॥మాదాల వెంకట రాజేష్ పాఠశాలలోని 150మంది పిల్లలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. డా॥సుజాతమ్మ పిల్లల తల్లిదండ్రులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగించారు. సిప్లా కంపెనీ ప్రతినిధులు ఉచితంగా మందులు పంపిణీచేసారు.

కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మురళీ, ఉపాధ్యాయులు ఏ.వీరాస్వామి, యస్.మహేష్, వసంతకుమారి, ఎన్.కల్పనాదేవి, యస్.కె.షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటి డిఇఓపై విచారణ చేపట్టాలి

## ఆర్జేడీకి యుటిఎఫ్ నాయకుని వినతి

నెల్లూరు ఉపవిద్యాశాఖ అధికారి మేరీ చంద్రికపై విచారణ చేపట్టాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి పరంధామయ్య ఇటీవల నెల్లూరుకు వచ్చిన గుంటూరు ఆర్జేడీ పార్వతిని కలసి వినతి పత్రం సమర్పించారు. డిఇఓగా మువ్వా రామలింగం వున్నప్పుడు, వారికి గిట్టనివారిపై తనిఖీలు నిర్వహించి బోగస్ నివేదికలు సమర్పించేవారని ఆయన ఆర్జేడీకి విన్నవించారు. అదేవిధంగా, చెముడుగుంట ప్రధానోపాధ్యాయుడి లీలలను గత రెండేళ్ళ నుంచి ఉప విద్యాశాఖాధికారి తొక్కిపెట్టి, కాపాడే ప్రయత్నాలు చేస్తున్నారంటూ ఆయన ఆ వినతిపత్రంలో ఫిర్యాదు చేశారు. ఈ విషయాలన్నింటిపై విచారణ చేపట్టాలని ఆయన ఆర్జేడిని కోరారు.

## మంచిరోజులు పోయి...

# ముంచే రోజులు తెచ్చిన నమో



నెల్లూరులోని వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా కార్యాలయంలో ఈనెల 12 జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అబ్దుస్ సమి మాట్లాడుతూ యన్.డి.ఎ ప్రభుత్వం మంచిరోజులు తెస్తామని అధికారంలోకి వచ్చి ప్రజల చెవిలో పువ్వు పెట్టారన్నారు. కోటి ఆశలతో ఎదురుచూస్తున్న సామాన్య మానవునికి నమో ప్రభుత్వం రిక్తహస్తాలు చూపించారే తప్ప, ఎటువంటి ఆశలు నెరవేర్చలేదన్నారు. నమో తన స్వరాష్ట్రంలో నిర్మించతలపెట్టిన "సర్దార్ వల్లభాయ్ పటేల్" విగ్రహానికి 200కోట్ల రూపాయలు కేటాయించి, మరో పక్క మహిళలు రక్షణ కోసం కంటితుడుపుగా 150కోట్ల రూపాయలను మాత్రమే కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. గంగానదిని ప్రక్షాళన చేయవచ్చు కాని వేల కోట్ల రూపాయలను దాని కోసం వెచ్చించటం బాధాకరమైన అంశమని పేర్కొన్నారు. మధ్యతరగతి ప్రజలకు అమడ దూరంలో ఉండే యల్.ఇ.డి/ యల్.సి.డి టీవీలు ల్యాప్‌టాప్‌లు వాటిపై సుంకంను తగ్గించటం ఉన్నత వర్గాలకే తప్ప, మధ్య తరగతి వారికి ఒరిగేది ఏమి లేదని, ఆంధ్ర ప్రదేశ్ విభజన తరువాత అభివృద్ధికి స్పష్ట మైన ప్రణాళిక ఇవ్వలేదని, హైదరాబాదు వంటి నగరాన్ని సీమాంధ్రలో నిర్మించటానికి కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఏది ఏమైనప్పటికి బడ్జెట్ సాధారణ, మధ్యతరగతి ప్రజలకు, రైతులకు ఆశాజనకంగా లేదని మంచి రోజులు వస్తాయని చెప్పిన నమో ముంచే రోజులు తెచ్చారని అబ్దుల్ సమి ఆందోళన వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో ఇర్ఫాన్, ఇలియాస్ ఖాన్, షాహుల్, అబ్దుల్‌కలాం, మున్వర్, సంధాని, ముజీబ్ పాల్గొన్నారు.

# బహిరంగ మద్యపాన సేవనాన్ని నిషేధించాలి



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న ఎంబిఎం నాయకులు

నెల్లూరు జిల్లా అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌ని ఈ నెల 11న యంబియం జిల్లా అధ్యక్షులు మహమ్మద్ రవూఫ్ ఆధ్వర్యంలో నాయకులు కలిసి బహిరంగంగా మద్యపానం సేవించడాన్ని నిషేధించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యం.బి.యం జిల్లా అధ్యక్షులు మహమ్మద్ రవూఫ్ మాట్లాడుతూ నెల్లూరులో మద్యపానాన్ని బహిరంగంగా విచ్చలవిడిగా సేవిస్తున్నారని బ్రాందీషాపుల్లోనే త్రాగడానికి ఏర్పాట్లు చేసి వుంచుతున్నారని పేర్కొన్నారు. ఈ బ్రాందీ షాపులు పాఠశాలలు, కళాశాలలు, ప్రార్థనా మందిరాలు, జనావాసాల మధ్య ఏర్పాటుచేస్తున్నారని తెలిపారు. బహిరంగంగా విచ్చలవిడిగా మద్యపానం సేవిస్తూ దారిన పోయే మహిళల పట్ల అసభ్యంగా వ్యవహరిస్తూ నానాఅవస్థలకు గురిచేస్తున్నారని, మహానగరమైన హైదరాబాదులోనే సిసి మహీంద్రరెడ్డి బహిరంగ మద్యపానాన్ని నిషేధించారని, లేదంటే త్రాగిన వారిని షాపు యజమానిని అరెస్టు చేస్తామని హెచ్చరించిన వార్తలు కూడా వచ్చి వున్నాయని పేర్కొన్నారు. కాబట్టి మన ఎస్పీ కూడా బహిరంగ మద్యపానం మీద కఠినంగా వ్యవహరించి సరియైన శిక్షలు విధించాలని, ఆ విధంగా చేసి ప్రజల మాన, ప్రాణాలకు తగిన రక్షణ కల్పిస్తారని కోరుతున్నామన్నారు.

కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి హమీద్‌హుస్సేన్, వసీం అహమద్, అన్వర్, షఫీ, రఫీ, అమీర్‌జాన్, యం.బి.యం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఈ నెల 19న ప్రారంభించనున్న నెల్లూరులోని ప్రభుత్వ వైద్యకళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర పురపాలక శాఖామంత్రి డా॥ పి.నారాయణ, పక్కన జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, ఎస్పీ నవదీప్‌సింగ్

## రంగుల ప్రపంచం

(మొదటిపేజీ తరువాయి)

షార్‌సెంటర్, పులికాట్ సరస్సు, జాతీయ రహదారి, సముద్రతీర ప్రాంతం అన్నీ ఉన్నాయి. పోర్టులు, రైల్వేస్టేషన్‌లున్నాయి. నెల్లూరు, చిత్తూరు జిల్లాలలో షూటింగ్ స్పాట్‌లు అనేకం ఉన్నాయి. కొండలు, లోయలు, తలకోన వంటి జలపాతాలు ఉన్నాయి. ఇక చెన్నైతో పాటు రేణిగుంట ఎయిర్‌పోర్టు దగ్గరగా ఉంటుంది. హైదరాబాద్‌లో సినిమాలు తీయాలంటే టాక్స్‌ల రూపంలో నిర్మాతకు వాచిపోతుంది. ఆంధ్రాలో అయితే ఆ సమస్య ఉండదు. ఇప్పటికే చాలామంది హీరోలు, హీరోయిన్‌లు, దర్శకులు చెన్నైలో ఉంటున్నారు. షూటింగ్ సమయాలలో వీరిని హైదరాబాద్‌కు తీసుకురావాలంటే విమానాలకు, స్టార్ హోటళ్లకు బోలెడంత ఖర్చవుతుంది. అదే తడ ప్రాంతాలలో షూటింగ్ అయితే చెన్నై నుండి గంటలో వచ్చేస్తారు. సాయంత్రం షూటింగ్ ముగించుకుని తిరిగి చెన్నైకు వెళతారు. విమానటిక్కెట్లు లేవు, స్టార్ హోటళ్లు అవసరం లేదు. చెన్నై నుండి సినీ సాంకేతిక నిపుణులు కూడా అందుబాటులో ఉండడమే కాక హైదరాబాద్‌తో పోలిస్తే తక్కువ ఖర్చుతో వస్తారు. ఇక రీ రికార్డింగ్, ల్యాబ్‌లు వంటి వాటికి చెన్నై ఎంతో అనుకూలంగా ఉంటుంది. విశాఖలో అయితే వీటన్నింటిని కొత్తగా సమకూర్చుకోవాల్సి ఉంటుంది.

ఇప్పుడు ఒక సినిమా నిర్మించాలంటే ఖర్చు కోట్లలో ఉంటుంది. ఖర్చు సాధ్యమైనంత వరకు తగ్గించాలనే ఉద్దేశ్యంతో సురేష్ సినీపరిశ్రమను తడ ప్రాంతానికి తరలించాలని చూస్తున్నారు. ఈమేరకు తడ వద్ద స్టూడియో నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. మరికొంతమంది తెలుగు నిర్మాతలు కూడా ఆయనను అనుసరిస్తే నెల్లూరుజిల్లాలో సినీవెలుగులు ఖాయం.

## 12వ డివిజన్‌లో ఆనం పర్యటన



నెల్లూరు నగరపాలకసంస్థ 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి ఈ నెల 16వ తేదీన తన డివిజన్ పరిధిలోని అల్లీపురం, పెద్ద చెరుకూరులలో పర్యటించారు. పారిశుద్ధ్యం, డ్రైనేజీ, తాగునీటి సరఫరాను పరిశీలించారు. స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్యాంసన్, మున్సిపల్ ఇంజనీర్ సంపత్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు శేషారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, పురంధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ వైఖరిపై నిరసన



హైదరాబాద్‌లోని సీమాంధ్ర విద్యార్థుల పట్ల పక్షపాత ధోరణి అవలంబిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వైఖరిని నిరసిస్తూ తెలుగునాడు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12న నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లో ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేసారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు కె.తిరుమలనాయుడు మాట్లాడుతూ విభజనకు ముందు అన్నదమ్ముల్లా విడిపోదామన్న కేసీఆర్ నేడు వారిని శత్రువులుగా చూడడం తగదన్నారు. స్కాలర్‌షిప్స్, ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లింపులో కేసీఆర్ పక్షపాత ధోరణితో వ్యవహరించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్ ఎస్‌ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.కె.అమృల్లా, దత్తాత్రేయ, మోను, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, వంశీ, అభిలాష్, మురళి, ముమైత్‌షా తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ జేసీస్ వితరణ



జేసీస్–నెల్లూరు అనుబంధసంస్థ జూనియర్ జేసీస్ కోశాధికారి చలువాది అనీషా పుట్టినరోజును పురస్కరించుకొని ఈ నెల 12న నెల్లూరు పప్పుల వీధిలోని శ్రీ పాండురంగ అన్నదాన సమాజం హాస్టల్ విద్యార్థులకు అలాగే ఉడ్‌హౌస్ కాలనీ విద్యార్థులకు లాంగ్‌నోట్ పుస్తకాలు, ప్యాడ్స్, పెన్నులు, చాక్లెట్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో జేసీటీ ఛైర్ పర్సన్ చలువాది ఉమారాణి, జూనియర్ జేసీస్ ఛైర్‌పర్సన్ మోనీషా, జేసీఐ అధ్యక్షులు సి.హెచ్.శరణ్‌కుమార్, కార్యదర్శి వి.ఇ.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేలపట్టుకు కొత్త కళ



దొరవారిసత్రం మండలంలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రానికి కొత్తగా కృష్ణ జింకలు, కొండ రామచిలుకలు రావడంతో నేలపట్టుకు కొత్త కళ వచ్చినట్లయింది. ఈ నెల 15న తిరుపతి జంతు ప్రదర్శనశాల నుంచి 8 కృష్ణ జింకలను, 12 కొండ రామచిలుకలను ఇక్కడికి తెచ్చారు. వీటిని ఇక్కడ వున్న జింకల పార్కులో వదిలారు. రెండు రంగులు కలిగిన ఈ కొండ రామచిలుకలు, కృష్ణ జింకలు సందర్శకులను బాగా ఆకట్టుకుంటున్నాయి.

## ఏపీ జెన్‌కోలో పెరగనున్న విద్యుదుత్పత్తి



ముత్తుకూరు మండలంలోని నేలటూరులో 16 వందల మెగావాట్ల సామర్థ్యంతో నిర్మాణంలో వున్న ఏపీ జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని పెంచేందుకు ప్రాజెక్టు అధికారులు ముమ్మర చర్యలు చేపట్టారు. ప్రస్తుతం 260 మెగావాట్లు ఉత్పత్తి జరుగుతుండగా, ఈ ఆగస్టు నెలాఖరునాటికి సుమారు 8 వందల మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, విద్యుత్ అవసరాలను దశలవారీగా తీర్చేందుకు ఏపీ జెన్‌కో చర్యలు తీసుకుంటోంది. కాగా, ఈ థర్మల్‌కేంద్రంలో మూడవ యూనిట్‌ను ప్రారంభించేందుకు కూడా ఏపి జెన్‌కో ప్రభుత్వ అనుమతి పొందింది. ఇటీవల కొన్ని సాంకేతిక సమస్యలు ఏర్పడినప్పటికీ, అన్ని సమస్యలనూ అధిగమించి త్వరలో ఈ థర్మల్ విద్యుత్‌కేంద్రంలో విద్యుదుత్పత్తిని బాగా పెంచేందుకు ప్రాజెక్టు అధికారులు చర్యలు తీసుకుంటుండడం ఎంతైనా సంతోషకరం.

## 'దేశం' వశమైనట్లే?

(మొదటిపేజీ తరువాయి)

పెంచలమ్మ తాను ఎవరికీ ఓటేయనని చెప్పి వెళ్లిపోయారు. ఇందుకూరుపేట జడ్పీటీసీ వెంకటరమణయ్య మాత్రం గైర్హాజరయ్యారు. వీరిద్దరిని మినహాయిస్తే ఇరు పార్టీలకు చెరో 22మంది జడ్పీటీసీలతో సమంగా ఉన్నాయి. ఇందుకూరుపేట జడ్పీటీసీ ఎక్కడ ఉన్నాడో అడ్రస్ చిక్కడం లేదు. పోలీసులు ఇతని కోసం గాలిస్తున్నారు.

కాగా ఈ నెల 20న తిరిగి ఛైర్మెన్ ఎన్నికను నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. కోరం లేకున్నా వచ్చిన సభ్యులతోనే ఎన్నిక తంతును పూర్తి చేయమని గట్టిగా చెప్పింది. ఈ నేపథ్యంలో ఈసారి ఎన్ని గొడవలు, రాద్ధాంతాలు జరిగినా ఛైర్మెన్ ఎన్నిక ఖాయంగా కనిపిస్తుంది. ఈ ఎన్నికలో కావలి, ఇందుకూరుపేట జడ్పీటీసీలే కీలకం కానున్నారు. ఆరోజుకు కూడా ఇందుకూరుపేట జడ్పీటీసీ ఆచూకీ కనుగొనలేకపోతే ఛైర్మెన్ ఎన్నిక రాజకీయమంతా కావలి జడ్పీటీసీ పెంచలమ్మ చుట్టూనే ఉంటుంది. బంధువుల ఒత్తిడితో ఆమె ఇప్పటికే తెలుగుదేశం క్యాంపు చేరిందనే ప్రచారం జరుగుతుంది. అయితే తెలుగుదేశం వాళ్లు ఆమెను పూర్తిగా నమ్మడం లేదు. రేపు 20వ తేదీ కూడా ఇరు పార్టీల నుండి గెలిచిన సభ్యులకు బారికేడ్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. వైకాపా నుండి గెలిచి తెలుగుదేశంకు మద్దతు తెలుపుతున్న సభ్యులకు ఇది ఒక ప్రతిబంధకంగా మారనుంది. పెంచలమ్మతో సహా వైకాపా నుండి జంప్ అయిన వాళ్ళు ధైర్యం కూడగట్టుకుని చేతులెత్తితే జడ్పీ పీఠం 'దేశం'దే!

## కొత్త ఎస్పీగా సెంథిల్

(మొదటిపేజీ తరువాయి)

ఐపిఎస్ అధికారి అయ్యుండి కూడా ఎస్పీ ఉద్యోగాన్ని బ్యాంకులో ఉద్యోగం మాదిరిగా వెలగబెట్టాడు. పోలీస్ జోష్‌ను ఎక్కడా కనపడనీయలేదు. టైం టు టైం అన్నట్లు ఉద్యోగం చేసుకున్నాడు. శని, ఆదివారాలొస్తే ఎవరికీ అందుబాటులో ఉండేవాడు కాదు. జిల్లా ఎస్పీగా ఆయన ప్రత్యేకంగా పొడిచిందేమీ లేదు. ఈ జిల్లా ఎస్పీగా అత్యధికంగా విమర్శలు ఎదుర్కొన్న బి.వి.రమణకుమార్ లాంటి వారు కూడా తమదైన ముద్ర ఉండేలా 'క్యాప్' వంటివి ప్రాజెక్టులు చేసారు. నవదీప్‌సింగ్ మాత్రం ఆఫీసుకొచ్చామా, టైంకు ఇంటికెళ్లామా అన్నట్లు ఉద్యోగం చేసి ఎస్పీ ఉద్యోగాన్ని ఈ రీతిలో కూడా చేయొచ్చని నిరూపించారు.

## ఆపుతున్నదెవరు?

(మొదటిపేజీ తరువాయి)

నాయకులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. చంద్రబాబు సీమాంధ్ర నుండి పరిపాలన సాగిస్తే ఆ ప్రభావం హైదరాబాద్ మీద తీవ్రంగానే పడుతుంది. అన్ని శాఖలకు సంబంధించి ఆంధ్ర ఉద్యోగులు దాదాపు 20వేల మంది హైదరాబాద్‌ను వదిలేసి సీమాంధ్రకు రావాల్సి వస్తుంది. ఇక మంత్రులు, ఎమ్మెల్యేలంతా కూడా విజయవాడకే వెళుతుంటారు. హైదరా బాద్‌లో వ్యాపారాలపై ఇది బాగానే ప్రభావం చూపుతుంది. పరిపాలనా విభాగమంతా ఇటొస్తే ఆ తర్వాత సినీ పరిశ్రమను తరలించాలనే ఒత్తిడి పెరుగు తుంది. చంద్రబాబుకు అత్యంత సన్ని హితులైన సినీ ప్రముఖులకు హైదరాబాద్‌లో భారీఎత్తున ఆస్తులున్నాయి. చంద్రబాబు అక్కడ కాకుండా ఏపికి వచ్చేస్తే వాళ్ల ఆస్తులకు రక్షణ లేకుండా పోతుంది. ఇప్పటికే తెలంగాణ పాలకులు ఆంధ్రావారి పట్ల చాలా కఠినంగా వ్యవహరిస్తున్నారు. గోకుల్ ట్రస్టు భూముల్లో అక్రమ నిర్మాణాలంటూ కూల్చిన ఇళ్లన్నీ ఆంధ్రులవే! ఆంధ్రాకు చెందిన పారిశ్రామికవేత్త లకు ఇచ్చిన భూములను తెలంగాణ ప్రభుత్వం వెనక్కి లాగేసుకునే పనిలో ఉంది. చంద్రబాబు ఇటొచ్చేస్తే హైదరాబాద్‌పై టీఆర్‌ఎస్‌కే పూర్తి పట్టు లభిస్తుంది. అంతేకాదు తెలంగాణలో తెలుగుదేశం పార్టీ కనుమరుగవుతుంది. మొన్న ఎన్నికల్లో గెలిచిన తెలుగుదేశం ఎంపీ, ఎమ్మెల్యేలు ఇక ఆ పార్టీలో 'ఆకర్ష్' క్రింద టీ–టీడీపీ ఎమ్మెల్యేలను లాగేందుకు టీఆర్‌ఎస్ తమ నేతలను రంగంలోకి దించింది. తెలంగాణలో టీడీపీని నిలబెట్టుకోవడంతో పాటు హైదారాబాద్‌లో వున్న తన ఆప్తులు, బంధువుల ఆస్తులను కాపాడుకోవడానికే చంద్రబాబు హైదరాబాద్‌ను వదలడం లేదు. తనను సీఎంను చేసిన ఆంధ్ర ప్రజల కంటే హైదరాబాదే ఆయనకు ఎక్కువై పోయిందని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. హైదరాబాద్ పదేళ్లు ఉమ్మడి రాజధాని అయినా అక్కడ సీఎంగా కేసీఆర్‌కు లభించే గౌరవం, హోదా చంద్రబాబుకు రావు. ఎందుకంటే అధికారికంగా కాకపోయినా భౌగోళికంగా హైదరాబాద్‌కు సీఎం కేసీఆరే! చంద్రబాబు కూడా ఆయన పాలనలో ఉన్నట్లే! దీనికంటే కూడా ఆత్మగౌరవంతో హైదరాబాద్‌ను వదిలేసి రావడం మేలు!



ఈ నెల 16వ తేదీన గూడూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పొనకా దేవసేనకు అభినందనలు తెలుపుతున్న మున్సిపల్ కమిషనర్ అనురాధ

# అందరి సహకారంతో పట్టణాభివృద్ధి

## పొనకా దేవసేన



మున్సిపల్ ఛైర్‌పర్సన్ దంపతులను సన్మానిస్తున్న 13వవార్డు కౌన్సిలర్ షంషీద్

గూడూరు పట్టణ ప్రజలు, వివిధ పార్టీలకు చెందిన నాయకుల సహకారంతో గూడూరు పురపాలక సంఘాన్ని అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానని గూడూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన చెప్పారు. పట్టణంలోని చిన్న మసీదు వీధిలోని షాదీమంజిల్‌లో ఆదివారం రాత్రి 13వవార్డు కౌన్సిలర్ షంషీద్ ఆధ్వర్యంలో ఛైర్‌పర్సన్ దంపతులను వైస్ ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, బలిజ సంఘ గౌరవాధ్యక్షుడు చదలవాడ హరిప్రసాద్‌నాయుడు, జిల్లా కాంగ్రెస్‌పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.కె.జిలానీలను సత్కరించారు. అనంతరం రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లీం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు.

# వేతనాలు చెల్లించండి



ఆర్డీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పిస్తున్న రెవెన్యూ గ్రామసేవకులు

గూడూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నాడు ప్రజావిజ్ఞప్తుల దినాన్ని నిర్వహించారు. డివిజన్ పరిధిలోని ఆయా మండలాలకు చెందిన ప్రజలు తమ సమస్యలపై వినతులను ఆర్డీవో కె.శ్రీనివాసరావుకు సమర్పించారు. గ్రామరెవెన్యూ సహాయకులకు ప్రతినెల 010పద్దు కింద వేతనాలు చెల్లించాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలియబరిచారు. జూన్ నెల వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. గతంలో ప్రతినెల జీతాలు చెల్లించేవారని వీఆర్‌ఏలను నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. తదుపరి ఆర్డీవో కె.శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘనాయకులు రాధాకృష్ణ, వెంకటసుబ్బయ్య, కృష్ణయ్య, రామయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

### ప్రైవేటు స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్

# జిల్లా ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్‌రెడ్డి



నెల్లూరు జిల్లా ప్రైవేటు స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా బి.శ్రీకాంత్‌రెడ్డి నియమితులైనారు. గూడూరులోని చిల్లకూరు లిటిల్ ఏంజల్స్ పబ్లిక్‌స్కూల్‌కు కరస్పాండెంటుగా వున్నారు. ఈయన రోటరీ క్లబ్‌లో కూడా అసిస్టెంట్ గవర్నర్‌గా పని చేస్తున్నారు. అనేక ప్రజాసేవ కార్యక్రమంలో ముందుంటారు. ఈయన ఎన్నిక పట్ల పలు ప్రైవేటు విద్యాసంస్థల యజమానులు హర్షం తెలియజేసారు.

# గూడూరు డివిజన్ వార్తలు

# వైభవంగా జగన్నాథుని రథయాత్ర

## పోటెత్తిన భక్తజనం



ప్రతి మనిషి సుఖసంతోషాలతో ఆనందమయ జీవితాన్ని గడపాలంటే ఆధ్యాత్మికత కలిగి ఉండటం అవసరమని వక్తలు పేర్కొన్నారు. గూడూరులోని డీఎన్ ఆర్ కమ్యూనిటీ హాలు సమీపంలో శనివారంనాడు నెల్లూరు ఇస్కాన్ మందిరం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, మున్సిపల్ ఛైర్ పర్సన్ పొనకా దేవసేన, తెలుగుదేశం గూడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బత్తల రాధాజోత్స్నలత ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. 1967లో పూరిలో జగన్నాథుని రథయాత్ర ప్రారంభ మైందన్నారు. అప్పటి నుంచి ఏటా దేశ వ్యాప్తంగా 500ప్రాంతాల్లో రథ యాత్రను భక్తులు నిర్వహిస్తున్నారన్నారు. లోకంలో అందర్నీ సమదృష్టితో చూడటమే కాకుండా పరాయి స్త్రీని తల్లిగా భావించిన రోజు లోకం శాంతియుతంగా ఉంటుందన్నారు. ఇది కేవలం జగన్నాథుని దర్శించుకున్న వారి వల్లే సాధ్యమవుతుందన్నారు. అనంతరం టీషర్టులు, సీడీలు ఆవిష్కరించారు. రథయాత్రను పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందజేశారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఇస్కాన్‌మందిరం ప్రతినిధులు వేదాంత చైతన్యదాస్, సత్య గోపీనాథ్‌దాస్, శ్రీవాత్సవ, సహదేవ, అతుల్‌కృష్ణా, రాంమురారీ, శ్రీనివాసశ్యాం, రూపేశ్వర్‌చైతన్య తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఇస్కాన్ మందిరం ఇన్‌చార్జి భానుప్రకాష్, ప్రతినిధులు వెంకట రమణారెడ్డి, సర్వేష్‌చంద్ర, మయూరి శ్యాంయాదవ్, అనీల్‌కుమార్, చదలవాడ హరిప్రసాద్‌నాయుడు, శిద్దారెడ్డి జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో జగన్నాథుడు

### నరసయ్యగుంటలో...

# సమస్యల తిష్ట

గూడూరు హైస్కూలురోడ్డు ప్రాంతంలోని నరసయ్యగుంట వీధిలో సమస్యలు తిష్టవేశాయి. పైపులైను కోసం తవ్వేయడంతో సిమెంటురోడ్డు ధ్వంసమయ్యాయి. ఆ వీధిలోని మూడు రోడ్ల మధ్యలో తవ్వేయడంతో దీంతో ఆ వీధిలో నివసిస్తున్న వారితో పాటు వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. రాత్రి పూట వీధిదీపాలు వెలగకపోవడంతో ఆ ప్రాంతంలో అంధకారం రాజ్యమేలుతోంది. ఇక్కడ గతంలో ఏర్పాటుచేసిన బోరు కిందకు కుచించుకుపోయింది. ఆ బోరు నుంచి వచ్చే నీరు తాగడానికి పనికి రాదు. మురుగు కాలువలు ధ్వంసమయ్యాయి. దోమల బెడద ఎక్కువగా ఉండడంతో రోగాల బారినపడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. తమ సమస్యలపై ప్రజా ప్రతినిధులు, నగరపాలకులు దృష్టిసారించి పరిష్కారానికి కృషిచేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### వీరభద్రస్వామి ఆలయంలో

# అన్నదానం

గూడూరు త్యాగరాజవీధిలో వున్న శ్రీ కళ్యాణ వీరభద్రస్వామి ఆలయంలో ఈనెల 15న అన్నదానం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తుమ్మూరు మునిమోహన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పట్టణంలోని వందలాది మంది భక్తులు ఈ అన్నదాన కార్యక్రమానికి విచ్చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి మంగళవారం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు దాతలు ముందుకు వస్తున్నారని, ఇందులో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామని పేర్కొన్నారు. లాయర్ గోపికృష్ణ ఈ కార్యక్రమానికి ఉభయకర్తగా వ్యవహరించారని ఆయన తెలిపారు.

# ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదవాలి

## మున్సిపల్ కమిషనర్ అనురాధ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అల్లారెడ్డి రవికుమార్‌రెడ్డి (సవేరా) ప్రక్కన డాక్టర్ సి.ఆర్.రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అనురాధ

ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఏర్పాటుచేసుకొని, దానిని సాధించేందుకు కష్టపడి చదవాలని గూడూరు మున్సిపల్ కమీషనర్ అనురాధ అన్నారు. గూడూరులోని డీఆర్‌డబ్ల్యు కళాశాలలో సోమవారంనాడు 34వ జ్యోతి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమీషనర్ అనురాధ మాట్లాడుతూ తల్లిదండ్రులు, అధ్యాపకులు సూచించే మార్గంలో వెళ్ళే విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారని తెలిపారు. కళాశాల అధ్యక్షులు ఎ.రవికుమార్ మాట్లాడుతూ కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులు అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ జ్యోతిని వెలిగించడం ఆనవాయితీగా వస్తుందని చెప్పారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ సి.ఆర్.రెడ్డి తదితరులు మాట్లాడారు. సవేరా ట్రస్టు తరపున విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ స్వరూపారాణి, వర్ధనమ్మ, భరతలక్ష్మి పాల్గొన్నారు.

# ఘనంగా గురుపూర్ణిమ ఉత్సవాలు



గూడూరు సాయి నగర్‌లో వున్న సాయి బాబా మందిరంలో రెండో పట్టణంలోని నరసింహారావుపేట వద్దగల సాయిమందిరాల్లో శనివారంనాడు గురుపూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా మందిరాల్లో కొలువుదీరిన సాయిబాబా విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేశారు. గురుపూర్ణిమను పురస్కరించుకొని ఉదయం ధునిపూజ, గురుచరిత్ర అఖండ పారాయణం, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయివ్రతంలో మహిళా భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

మధ్యాహ్నం శ్రీదత్త అభిషేకం, అన్నదానం చేశారు. సాయంత్రం సత్సంగం, భజనలు జరిగాయి. రాత్రి సాయినాథుని పల్లకీసేవను వైభవంగా నిర్వహించారు. బాబాను దర్శించుకొనేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయాల ప్రాంగణాలు కిక్కిరిసాయి.

# 'బ్రిక్స్' దేశాలతో మరింత చెలిమి



- అగ్రనేతలను ఆకట్టుకున్న ప్రధాని మోడీ వ్యవహారశైలి
- విజయవంతంగా బ్రెజిల్ పర్యటన

***ఈ నెల 15, 16 తేదీల్లో భారత ప్రధాని నరేంద్రమోడీ బ్రెజిల్ పర్యటన, 'బ్రిక్స్'దేశాలతో సమావేశాలు విజయవంతంగా సాగాయి. ఎంతో సామరస్యపూర్వక వాతావరణంలో జరిగిన బ్రిక్స్ దేశాల సదస్సులో ముఖ్యంగా భారత ప్రధాని నరేంద్రమోడీ చేసిన ప్రతిపాదనలు, ఆయన ప్రసంగాలు అగ్రనేతలందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ అంతర్జాతీయస్థాయి సదస్సులో మోడీ ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ఆయన ప్రసంగాలు ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.***

ఈ సందర్భంగా చైనా, భారత్‌లు కలసి స్నేహపూర్వకంగా చర్చలు జరుపుకోవడం ప్రపంచదృష్టిని ఆకర్షించింది. భారత ప్రధాని నరేంద్రమోడీ తొలి విదేశీ పర్యటనలో జరుగుతున్న తొలి సదస్సు ఇదే కావడం విశేషం. అయిదు దేశాలకు చెందిన ఈ శిఖరాగ్రసదస్సులో ప్రధాని నరేంద్రమోడీ తన ఆలోచనలను స్పష్టంగా చెప్పడం ఆయా దేశాధినేతలను సైతం బాగా ఆకట్టుకుంది. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా దేశాల(బ్రిక్స్) నేతలు ఈ సదస్సులో పాల్గొన్నారు. బ్రెజిల్‌లోని ఫార్టెలెజా నగరంలో ఈ నెల 15వ తేదిన ప్రారంభమైన ఈ శిఖరాగ్రసదస్సులో ప్రధాని నరేంద్రమోడీ తన వాణిని వినిపించారు. ఉగ్రవాదం ఏ రూపంలో వున్నా అది మానవత్వానికి వ్యతిరేకమనీ, దానిపై ఉదాసీనతతో వ్యవహరించరాదని, ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని ప్రధాని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆఫ్ఘనిస్తాన్ నుంచి ఆఫ్రికా వరకు వున్న ప్రాంతమంతా సంఘర్షణల్లో కొట్టుమిట్టాడుతోంటే, మనం మౌనప్రేక్షకుల్లాగా వుంటే భవిష్యత్ పరిణామాలు దారుణంగా వుంటాయని ఆయన అంటూ, ఇప్పుడు మనం తీసుకునే నిర్ణయాలు మన దేశాల భవిష్యత్తునే కాదు, మొత్తం ప్రపంచ భవిష్యత్తునే నిర్ధేశిస్తాయని వివరించారు. ఆఫ్ఘాన్ ప్రజలు ఎన్నో దశాబ్దాలుగా ఘర్షణల వాతావరణంతో ఎన్నో బాధలు పడుతున్నారని, ఆ దేశాన్ని శాంతియుతమైన ప్రజాస్వామ్య దేశంగా మార్చడానికి ప్రపంచమంతా ఒకటి కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచమంతా ఒకే కుటుంబమని నమ్మే వసుధైక కుటుంబం నుంచి తాను వచ్చానని భారత ప్రధాని మోడీ ఈ సదస్సులో సగర్వంగా ప్రకటించుకోవడం అందరినీ ఆకట్టుకుంది. ఈ సదస్సు సందర్భంగా బ్రిక్స్ బ్యాంక్ ఏర్పాటుకు చర్చలు జరిగాయి. బ్రిక్స్ అభివృద్ధి బ్యాంక్ కేంద్ర కార్యాలయాన్ని చైనాలోని షాంఘైలో ఏర్పాటు చేసేందుకు ఈ సదస్సులో సభ్యదేశాలు అంగీకారం వ్యక్తం చేశాయి. భారత్ సూచన మేరకు ఈ బ్యాంక్‌లో బ్రిక్స్ దేశాలన్నీ సమాన వాటాలుగా మూలధనం నిధులు అందజేయాలన్న అంశంపై అన్ని దేశాలు ఏకీభవించడం విశేషం. ప్రతిష్టాత్మకమైన ఈ బ్రిక్స్‌బ్యాంక్ ఏర్పాటులో భారత్ కీలకపాత్ర పోషించడం అందరి ప్రశంసలూ అందుకుంది.

కాగా, ప్రధాని మోడీ ఈ సదస్సుకోసం బ్రెజిల్‌కు వెళ్ళిన సందర్భంగా, తొలుత బ్రెజిల్‌లో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో 80 నిమిషాల పాటు సమావేశం కావడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. సరిహద్దు వివాదాలకి తెరదించుదాం.. ఎంతో కాలంగా నలుగుతున్న ఈ సమస్యను మనం సామరస్యంగా పరిష్కరించుకోగలిగితే ప్రపంచానికే ఆదర్శంగా నిలవవచ్చు..అంటూ చైనా అధ్యక్షునితో ప్రధాని నరేంద్రమోడీ పేర్కొనడంతో, అందుకు చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఏకీభవిస్తూ, స్నేహపూర్వకంగా, సానుకూల ధృక్పథంతో సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకుందామని చెప్పడం ఆహ్వానించదగ్గ పరిణామం. దీంతో ఇరుదేశాల మధ్య మరింత స్నేహపూర్వక వాతావరణానికి మార్గం ఏర్పడినట్లయింది. ఈ సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్రమోడీ తన ఆకాంక్షలను, అభిప్రాయాలను బ్రిక్స్ దేశాధినేతలకు స్పష్టంగా చెప్పడం, ఆ దేశాధినేతలు కూడా అందుకు అనుగుణంగా స్నేహపూర్వకంగా చర్చలు కొనసాగించి, మంచి నిర్ణయాలు తీసుకునేందుకు సంకల్పించడం ముదావహం. టిబెట్‌లో కైలాస్ మానససరోవర్ యాత్రకు మరో మార్గం వుండాలని మోడీ ఈ సందర్భంగా సూచించగా, ఆ సూచనను పరిశీలిస్తామని జిన్‌పింగ్ పేర్కొనడం మరో మంచి పరిణామం. అంతేకాదు, తొలి పరిచయంలోనే మోడీని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తమ దేశానికి ఆహ్వానించడం, నవంబర్‌లో చైనాలో జరిగే అపెక్ (ఆసియా, పసిఫిక్ ఆర్థిక సహకార ఫోరం) శిఖరాగ్ర సమావేశాలకు మోడీని ఆహ్వానించడం శుభపరిణామం. ఇది రెండు దేశాల చెలిమికి మరింత దోహదం చేస్తుందని వేరే చెప్పనక్కరలేదు. అంతేకాదు, షాంఘై సహకార సంస్థలోనూ భారత్ కీలకపాత్ర పోషించాలని జిన్‌పింగ్, భారత ప్రధాని నరేంద్రమోడీని కోరడం ఎంతో విశేషం.

ఏదేమైనా ప్రధాని బ్రెజిల్ పర్యటన, బ్రిక్స్ శిఖరాగ్రసదస్సులో పాల్గొనడం.. ఆయా దేశాల మధ్య మైత్రీభావం మరింత పెంపొందేందుకు, అందరిలోనూ సామరస్య పూర్వకమైన, స్నేహపూర్వకమైన వాతావరణం మరింత పరిపుష్టమయ్యేందుకు, మంచి అవగాహనతో, చర్చలతో సమస్యలను పరిష్కరించుకునేందుకు, తద్వారా భవిష్యత్తులో మరింత మేలైన ప్రగతిని సాధించేందుకు..అన్నిటికీ మించి ఎంతోకాలంగా జటిలంగా వున్న సరిహద్దు సమస్యల వంటి సమస్యలను కూడా సామరస్యంగా పరిష్కరించుకునేందుకు ఈ పర్యటన ఎంతో ఉపకరిస్తుందని భావించవచ్చు.

# రాజకీయచట్రంలో రాజధాని!



రాష్ట్ర రాజధాని ఎంపిక రాజకీయచట్రంలో బిగుసుకుంది. రాష్ట్రానికి అనువైన ప్రాంతమని కాకుండా కొన్నివర్గాల వారికి, తమకు అనుకూలమైన వారికి లబ్ది కలిగించాలనే దృష్టితో రాజధాని రాజకీయం జరుగుతుండడం విచిత్రమనిపిస్తుంది. ఓ పక్క రాజధాని ప్రాంతం పరిశీలన కోసం కేంద్రం నియమించిన శివరామకృష్ణన్ కమిటీ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో తిరుగుతుంది. భూముల లభ్యతను పరిశీలిస్తుంది. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి రాజధానిని ఎంపిక చేయాలి.

కాని శివరామకృష్ణన్ కమిటీ రాజధానిపై నివేదిక ఇవ్వకముందే ముఖ్యమంత్రి చంద్రబాబు గుంటూరు, విజయవాడల మధ్యే రాజధాని ఉంటుందని పదేపదే చెబుతూ వచ్చారు. రాజధాని ఎంపికలో ముఖ్యమంత్రి నిర్ణయం కీలకం. చంద్రబాబు గుంటూరు, కృష్ణ జిల్లాల వైపే మొగ్గు చూపిస్తున్నప్పుడు శివరామకృష్ణన్ కమిటీ ఇక రాష్ట్రంలో ఇతర ప్రాంతాలను పరిశీలించాల్సిన అవసరం లేదు.

రాజధానిపై ఇంకో నెలలో స్పష్టత వస్తుందని చంద్రబాబే చెప్పారు. ఆయనే గుంటూరు, విజయవాడల మధ్య రాజధాని అంటున్నారు. కొత్త రాజధాని నగరాన్ని సింగపూర్ లెవల్లో నిర్మిస్తామంటున్నారు. ఇందు కోసం ఒక బృందాన్ని సింగపూర్ కూడా పంపిస్తున్నారు.

గుంటూరు, విజయవాడలు రాజధానికి అనుకూలమైనవే! ముఖ్యంగా సీమాంధ్రలోని ఉత్తర, దక్షిణ జిల్లాలకు సమదూరంలో ఉన్నాయి. అన్ని జిల్లాల నుండి రైల్వే, రోడ్డు సౌకర్యాలున్నాయి. జాతీయ రహదారి వుంది. సముద్ర తీరప్రాంతం, పోర్టులు ఉన్నాయి. కృష్ణ జలాలు అందుబాటులో ఉన్నాయి. విజయవాడ, గుంటూరు, మంగళగిరి పెద్ద పట్టణాలు, ఇప్పటికిప్పుడు ఇక్కడనుండే పరిపాలన సాగించాల్సి వచ్చినా ఉద్యోగులు నివాసం ఉండడానికి అవకాశం ఉంటుంది. ఈ పట్టణాలలో ఉన్న ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను పెంచుకుంటూ పోవచ్చు. కొత్తగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను తేవాల్సిందేమీ లేదు. ఇక్కడ కాకుండా అడవుల్లోనో, ఎడారుల్లోనో రాజధానిని నిర్ణయిస్తే అక్కడ ప్రతిదీ కొత్తగా అభివృద్ధి చేయాల్సిఉంటుంది. ఇదంతా కూడా వేలకోట్ల రూపాయల ఖర్చుతో కూడుకున్న పని. ఇప్పుడు కేంద్రప్రభుత్వం రాజధాని నిర్మాణానికి భారీగా నిధులిచ్చే పరిస్థితులు లేవు. కాబట్టి ఉన్న నగరాలలో ఒకదానిని రాజధానిగా ఎంపిక చేసుకుని, మౌలిక సదుపాయాలు పెంచుకుంటూ పోవడమే ప్రస్తుతం మన రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన పని. అలాకాకుండా సింగపూర్ లాంటి రాజధానినే కట్టాలంటే చంద్రబాబుకు అది ఈ జన్మలో సాధ్యమయ్యే పని కాదు.

గుంటూరు, విజయవాడను కేవలం పరిపాలనా రాజధానిగా మాత్రమే ఉపయోగించాలి. ఈ రెండు జిల్లాల్లోనూ భూములు ఎంతో సారవంతమైనవి. సులభంగా రెండుకార్లు పంటలు పండుతాయి. ఈ భూములను రాజధాని నిర్మాణానికి, ఇతర భవనాల కోసం వాడుకోవడం మంచిది కాదు. ఒక ఎకరాను ఈ విధంగా వాడుకున్నా మన వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదలను మనమే అడ్డుకున్నట్లవుతుంది. కేంద్రం మంజూరు చేస్తున్న సంస్థలను గాని, రాష్ట్ర ప్రభుత్వం నిర్మించ తలపెట్టేది గాని జిల్లాల వారీగా వికేంద్రీకరించాలి. ప్రతి జిల్లాలోనూ ప్రతిష్టాత్మక అభివృద్ధి కార్యక్రమాలు జరిగేలా చూడాలి. నిరుపయోగంగా వున్న భూములను మాత్రమే కొత్త అభివృద్ధి కార్యక్రమాలకు వాడుకోవాలి. రాజధానిలోనే అన్నీ ఉండాలనే పాత చింతకాయ పద్ధతులను వదిలేసి, సింగపూర్ లాంటి రాజధానిని నిర్మించాలన్న పగటికలలు మాని చంద్రబాబు పరిపాలనపై దృష్టి సారించాలి.




Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.